




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 26, పేజీలు - 08

మంగళవారం, జులై 21, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# బీటలు వారిన నేలలు.. కరవు ఛాయలు

## - తెలుగు రాష్ట్రాలు కోలుకునేనా?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వానలు పడటం లేదు. దీంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్రను భారీ వర్షాలు అల్లాడిస్తున్నాయి. అక్కడ రోడ్లన్నీ చెరువుల్ని తలపిస్తున్నాయి. ఇప్పటికే వర్షాల్లో అనేక ప్రమాదాల్లో చిక్కుకుని పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాల్ని కోల్పోయారు. ఈ క్రమంలో వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే కర్ణాటకలోకూడా వానలు పడుతున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మాత్రం చినుకు రాలడం లేదు. దీంతో రైతులతో పాటు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### - తెలంగాణలో కురవని వానలు

తెలంగాణలోనూ వానలు కురియడం లేదు. అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. తాగు, సాగు నీటికి కూడా ఇబ్బందికరంగా మారింది. వానలు లేకపోవడంతో ప్రాజెక్టుల్లో నీరు లేదు. తెలంగాణ ఎక్కువగా భూగర్భ జలాల పై ఆధారపడి సేద్యం సాగుతుంది. కానీ విపరీతమైన ఎండల కారణంగా చాలా బోర్లు ఎండిపోయాయి. అనేక మండాలలను కరువు పరిస్థితులు ప్రకటించడానికి ప్రభుత్వం సిద్ధమయింది. ఎల్ నినో ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తుంది.మరొకవైపు జులై నెలలో చల్లదనాన్ని నిండుకుని ఉండే తెలంగాణ నేటికీ వేసవి కాలాన్ని తలపిస్తుంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా మేరకు వానలు అక్కడకక్కడ పడతాయని, తేలికపాటి వానలు మాత్రమే పడతాయని చెప్పింది. ఈ కరువు నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిందే.

### - ఏపీలో కరువు పరిస్థితులు

ఆంధ్రప్రదేశ్ లో వానలు లేక ఇప్పటికే కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల మాత్రం ప్రాజెక్టుల కింద భూములు సాగవుతున్నాయి కానీ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో నేలలు బీటలు వారాయి. అరక ముందుకు సాగడం లేదు. ఇక సీజన్ లో వ్యవసాయం లేనట్లేనన్న నిర్ణయానికి రైతులు వచ్చారు. అయితే ఈరోజు వానలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. తేలిక పాటి నుంచి మోస్తరు వానలు మాత్రమే పడతాయని చెప్పింది. కొన్ని చోట్ల పిడుగులు పడతాయని, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. నంద్యాల, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, పోవరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో తేలిక పాటి వానలు పడతాయని పేర్కొంది. కానీ అంచనాలు నిజమవుతాయా? లేదా? అన్నదే ప్రశ్న.

# ఫ్యాక్ట్స్, లాజిక్ ఉంటే గందరగోళం ఉండదు

## - పార్లమెంట్ సమావేశాల వేళ మోదీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ లక్ష్యాలను సాధించడానికి సానుకూల దృక్పథం ఎంతో అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఫ్యాక్ట్స్, లాజిక్ ఉన్నచోట గందరగోళానికి, ఉద్రిక్తతలకు తావుండదని తాను గట్టిగా నమ్ముతున్నానని చెప్పారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు పార్లమెంట్ ఆవరణలో మోదీ మాట్లాడారు. "దేశ లక్ష్యాలను సాధించడానికి సానుకూల దృక్పథం ఎంతో అవసరం. మన సభలో ఎంతో అనుభవజ్ఞులైన పార్లమెంటు సభ్యులు ఉన్నారు. వారు ఏ పార్టీకి చెందినవారైనప్పటికీ వారికి అపారమైన అనుభవం ఉంది. ఇలాంటి సమయంలో పార్లమెంటుకు, దేశానికి వారి అనుభవం, జ్ఞానం ఎంతో అవసరం. అందుకే పార్లమెంటు సజావుగా సాగడం, అర్థవంతమైన చర్చలు జరగడం, దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టి సంకల్పంతో ముందుకు సాగడం అవసరమని నేను భావిస్తున్నాను. ఆశయాలతో ఉప్పొంగుతున్న దేశ యువత, మనం ముందుకు సాగాలని కోరుకుంటోంది" అని మోదీ పేర్కొన్నారు.
వాదనలు, వాస్తవాలు బలంగా ఉన్నప్పుడు ప్రశాంతంగా వాయిస్ వినిపించవచ్చని మోదీ అన్నారు. అలాంటి వాదనలు, వాస్తవాలతో సభలో జరిగే చర్చలు మరింత ఫలవంతంగా ఉంటాయని తాను ఆశిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరి అవకాశం లభించాలని, ప్రతి ఆలోచనకూ గౌరవం దక్కాలని అన్నారు. పార్లమెంట్ వర్షాకాల

2లో..

# పేదల సొంతింటి కలను సాకారం చేసేది కాంగ్రెస్

- హైదరాబాద్ పేదలకు బిగ్ ఆఫర్ - క్యూర్ పరిధిలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- ఇందిరమ్మ ఇళ్ల నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తాం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కల కంటున్న అల్పాదాయ వర్గాలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్

2లో..

## త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్ఖడ్ అనుమానాస్పద మృతి

- తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణ



అగర్తలా (ప్రశ్న న్యూస్) త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని

2లో..

# కొత్త లుక్‌లో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు

## - పరిశీలించిన సీఎం చంద్రబాబు

- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో మాతా--శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వ గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా 'తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, తల్లి–శిశువులకు కల్పించిన

2లో..

## క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది.

2లో..

# మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం

- ఆత్మహత్యాయత్నం చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి
- ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్ - లేఖతో ఆసక్తికర అంశాలు తెరపైకి!




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో వెలుగు చూసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసు పూటకో మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నం చేసుకోగా, తాజాగా ఆయన రాసినట్లు పేర్కొంటున్న ఓ సూసైడ్ లెటర్ నెట్టింట తెగ హల్‌చల్ చేస్తోంది. తనపై ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై ఉదయ్ కృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయంటూ పేర్కొనడం ఈ కేసులో బిగ్ ట్విస్ట్‌గా మారింది. ఈ సూసైడ్ లేఖలో ట్రైనీ మహిళా ఐపీఎస్‌తో తనకు ఉన్న సంబంధంపై ఉదయ్ కృష్ణారెడ్డి వెల్లడించాడు. ఆమెతో ఏడాదిగా సన్నిహితంగా

2లో..

# సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం

- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం
- ఉద్దేశపూర్వకంగా పిటిషన్లు వేసేవారిని గుర్తించాలని సూచన
- రాష్ట్రంలో 49% వర్షపాత లోటు.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన, సులభతరమైన సేవలు అందించేందుకే 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు' ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు.

2లో..

## బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు హైకోర్టు బ్రేక్

- బహదూర్‌గూడ భూముల వివాదంలో రైతులకు రిలీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ భూముల వివాదంలో తెలంగాణ హైకోర్టు కీలక

2లో..

# గాచారం బాగాలేకనే పోచారం వేరే పార్టీలోకి వెళ్లారు

### - కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కేటీఆర్ పార్టీలో చేరిన వారందరికీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో ఎగిరేది గులాబీ జెండానే అని దీమా వ్యక్తం చేశారు. 'పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే బొంద పెట్టుకున్నాడు, బండ కట్టుకొని ఆయనే బాయిలో దూకిండు అని ఎద్దేవా చేశారు. ఊడిపోయే కాంగ్రెస్‌లో చేరి నేను కాంగ్రెస్‌లోనే పుట్టినా అని డైలాగులు కొట్టిండు. గ్రహచారం బాగాలేకనే పోచారం పార్టీ నుండి వెళ్ళిపోయాడు' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

### - పోచారం దేవుని మీద ఒట్టేసి మాట తప్పిండు

'2023 ఎన్నికల్లో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండు'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పోచారం పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు అంటూ సెటైర్లు వేశారు.'కక్కలేక మింగలేక ఇబ్బంది పడుతున్నాడు. నిన్న మొన్నటి వరకు స్పీకర్‌గా చేసిన ఆ పెద్ద మనిషికి తాను ఏ పార్టీలో ఉన్నానో కూడా చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నాడు. ఈ వయసులో ఇంత అవస్థ అవరమా? కేసీఆర్ ఇచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేయించుకొని

2లో..

# రణరంగంగా మారిన "చలో సంసద్"

- ఉద్రిక్తంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన చలో పార్లమెంట్
- అడ్డుకోవడంతో పోలీసులపై చెప్పులు విసిరిన సీజేపీ కార్యకర్తలు
- చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించిన భద్రతా దళాలు



న్యూఢిల్లీ విద్యా వ్యవస్థలో వైఫల్యాలు, నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన పార్లమెంట్ ముట్టడి ఉద్రిక్తతంగా మారింది. పోలీసులు అనుమతి నిరాకరించినా..
ఆందోళనకారులు పార్లమెంటు వైపుగా దూసుకెళ్లడంతో వారిపై భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగించి, చెదరగొట్టడానికి లాఠీఛార్జ్ కూడా చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ 'చలో సంసద్'కు సీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్‌కు బయలుదేరిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించిన నిరసనకారులను అడ్డుకోవడంతో పోలీసు సిబ్బంది కొందరికి గాయాలయ్యాయి. భద్రతా దళాలపై సీజేపీ కార్యకర్తలు చెప్పులు, వాటర్ బాటిళ్లను విసిరారు. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కేతో పలువురు నిరసనకారులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు

2లో..

# పేదల సొంతింటి కలను సాకారం చేసేది కాంగ్రెస్

మధ్య ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లోని 26 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పేదల కోసం ఏకంగా ఒక లక్ష నూతన గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న పట్టణీకరణ, పేదల ఆవాస అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ సమగ్ర గృహ నిర్మాణ బృహత్ ప్రణాళిక శంకుస్థాపనకు జూలై 20న అడుగులు పడ్డాయి.

**- మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు**

ఈ మెగా ప్రాజెక్టును దశలవారీగా వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా మొదటి విడత కింద ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. భూముల కొరతను అధిగమించడంతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు కల్పించేందుకు గాను, సాంప్రదాయ ఇళ్లకు భిన్నంగా వర్టికల్ గ్రోత్ మోడల్‌లో 10 అంతస్తుల మోడర్న్ రెసిడెన్షియల్ టవర్లను నిర్మించనున్నారు. ప్రణాళికాబద్ధంగా రూపొందించిన ఈ కమ్యూనిటీల్లో విశాలమైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, లిఫ్ట్ సదుపాయాలతో పాటు విద్యుత్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

**- ఏడాదికి రూ.6 లక్షల కన్నా తక్కువ సంపాదించే అందరూ అర్హులే**

ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వం పారదర్శకమైన, కఠినమైన నిబంధనలను ఖరారు చేసింది. వార్షికాదాయం రూ. 6 లక్షల లోపు ఉన్న కుటుంబాలు మాత్రమే ఈ గృహాల కేటాయింపునకు అర్హులు . దీంతో పాటు తెలంగాణ పరిధిలో ఇప్పటివరకు ఏ ప్రాంతంలోనూ సొంతంగా పక్కా ఇల్లు లేదా ప్లాట్ లేని నిరుపేద కుటుంబాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో డిజిటల్ సర్వేల ద్వారా సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనున్నారు.

**- ఇప్పటికే స్థల పరిశీలనలు పూర్తి**

పట్టణాల్లో గుడిసెలు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న కార్మికులు, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు శాశ్వత నివాస యోగ్యమైన ఇళ్లను అందించడమే లక్ష్యంగా గృహ నిర్మాణ శాఖ రంగంలోకి దిగింది. నియోజకవర్గానికి తొలిదశలో కేటాయించిన 500 ఇళ్లకు సంబంధించిన స్థల సేకరణ, ల్యాండ్ బ్యాంక్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియలను కూడా అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. హెచ్ఎండీఏ , హౌసింగ్ బోర్డు , స్థానిక పురపాలక వర్గాలు సమన్వయంతో పనులను పర్యవేక్షిస్తున్నాయి. గతంలో ఇళ్ల కేటాయింపుల్లో ఎదురైన ఆలస్యాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణతో నిర్ణీత గడువులోగా టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, లబ్ధిదారులకు తాళాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో రాబోయే రోజుల్లో క్యూర్ ప్రాంతం ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అక్కడ పేదలకు పక్కా ఇల్లు కల్పించడం వల్ల వారి జీవన ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ఫ్యాక్ట్స్, లాజిక్ ఉంటే గందరగోళం ఉండదు

సమావేశాలలో సభ్యులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.వర్షాకాలం అయినా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు అయినా చురుకుగా ఉంటేనే అత్యంత ఫలప్రదంగా ఉంటాయని మోదీ పేర్కొన్నారు. ఈ రెండు ఫలప్రదంగా సాగితేనే దేశానికి శ్రేయస్సు, ప్రజలకు సంక్షేమం చేకూరుతాయని అన్నారు. అందుకే వర్షాకాలం యాక్టివ్‌గా సాగాలని అలాగే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కూడా ఫలప్రదం కావాలని ఆశిద్దామని పేర్కొన్నారు. భారతదేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావిస్తూ దేశం అనేక మైలురాళ్లను అధిగమించిందని, అవి ప్రతి భారతీయుడికీ గర్వకారణంగా నిలిచాయని మోదీ చెప్పారు. "కేవలం ఒక్క నెలలోనే దేశం అనేక మైలురాళ్లను సాధించింది. ప్రతి పౌరుడిలోనూ గర్వాన్ని నింపే విజయాల పరంపర ఇది. జాతీయ స్థాయి కావచ్చు, అంతర్జాతీయ వేదిక కావచ్చు లేదా ఇప్పుడు అంతరిక్ష రంగం కావచ్చు ఇవన్నీ భారతదేశానికి నిజంగా గర్వించదగ్గ క్షణాలు" అని ప్రధాని మోదీ అన్నారు.స్కైరూట్ ఏరోస్పేస్‌ను, ఆ స్టార్టప్ వెనుక ఉన్న యువ బృందాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. "గత ఏడాది వర్షాకాల సమావేశాలకు కొద్ది రోజుల ముందు ఒక భారతీయ పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకున్నారు. అలాగే మొన్ననే ఒక యువ భారతీయ స్టార్టప్ అద్భుతమైన విజయాన్ని సాధించింది. ప్రపంచంలో చాలా తక్కువ దేశాలు మాత్రమే ఇటువంటి ప్రైవేట్ రంగ కృషిని చూశాయి. భారతీయ యువత అంతరిక్షంలోకి కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇది అద్భుతమైన విజయం. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్టకు విస్తృత గుర్తింపు, ఆదరణ లభిస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆశయాలు అంతరిక్షం అంత అనంతమైనవి అనే శక్తివంతమైన సందేశం ఇది" అని మోదీ పేర్కొన్నారు.

# త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్ఖడ్ అనుమానాస్పద మృతి

తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# గాచారం బాగాలేకనే పోచారం వేరే పార్టీలోకి వెళ్లారు

ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పాడు. పోచారం దేవుని మీద ఒట్టేసి మాట తప్పిండు. రేవంత్ రెడ్డి ఒక్కడే దేవుడి మీద ఒట్టేసి మోసం చేస్తడు అనుకున్నాం. కానీ పోచారం కూడా మోసం చేశాడు'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

**- రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాదు ఓ చిచోరాగాడు**

మరోవైపు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.'రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాదు ఓ చిచోరాగాడు, ఎప్పుడు ఏం మాట్లాడుతాడో తెలియదు. ఖర్మగాలి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిండు'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకీ మూటలు మోసుడే రేవంత్‌కు సరిపోతుందని, దోచుకున్నది రాహుల్‌కు అప్పజెప్పాలి తిరిగి రావాలి. ఆయనకు అది తప్ప మరేం తెలువదంటూ సెటైర్లు వేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండేళ్లు పనిచేసిన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేశాడని ప్రశ్నించారు. మైక్ దొరికితే చాలు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. 'ఎక్కడికి వెళ్తే అక్కడి దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానని మోసం చేయడం, రేవంత్ మాటలు కోటలు దాటినయ్ మాటలు గడప దాటలేదు. కానీ కేసీఆర్ పాలనలో రైతులు సల్ల కదలకుండా పనులు అయ్యేవి. ఎరువులు, విత్తనాలు, యూరియా అన్నీ అందుబాటులో ఉండేవి. ఆటోకు ఒక్క ఫోన్ చేస్తే నాడు యూరియా పొలం కాడికి వచ్చేంది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు.

**- రక్తం చల్లాలని రేవంత్ చెప్తుండు**

కాంగ్రెస్ పాలనలో యాప్‌లో తీసుకొచ్చి రైతులను ఆగం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కరెంట్ సరిగా లేదు. కనీసం ధాన్యం నింపేందుకు సంచులు కూడా లేవని అయితే ఢిల్లీకి మాత్రం నగదు సంచులు మోస్తున్నాడంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ మళ్లీ గెలువాలని చూస్తున్నది. రుణమాఫీ చేయని ఆ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. అదను చూసి కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలని కేటీఆర్ పిలునిచ్చారు. కరువు వచ్చింది ఏం చేయాలని అడిగితే రక్తం చల్లాలని రేవంత్ చెప్తుండు.

ఇలాంటి కరువుని ఎదుర్కోవడానికి ముందస్తుగా కేసీఆర్ పంప్ హౌస్ కడితే బటన్ నొక్కమంటే నొక్కడం లేదు'అని కేటీఆర్ విమర్శించారు.'రైతులు పంటలు పండిస్తే ప్రభుత్వ పథకాలు ఎక్కడ ఇవ్వాల్సి వస్తుందోనని పంపులు ఆన్ చేసి నీళ్లివ్వడం లేదు.గోదావరిలో నీళ్లు వృథాగా పోతున్నా నీళ్లను లిఫ్ట్ చేయకుండా కేసీఆర్‌ని తిడుతున్నడు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

# క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

**- ఒకేసారి మూడు నెలల బియ్యం**

ఇదిలాఉంటే రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

# సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం

ఈ సమావేశంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను స్థాపిస్తున్నాం. ఇది ఎంతమాత్రమూ ప్రైవేటీకరణ కాదు" అని తేల్చిచెప్పారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని చంద్రబాబు హామీ ఇచ్చారు.పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ఈ కేంద్రాలు పనిచేస్తాయని, వాటి పనివిధానాన్ని ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వల్ల ఆ ప్రక్రియ ఎంత సులువుగా మారిందో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా అదే విధంగా మారుతుందని ఆయన వివరించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఈ కేంద్రాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. "వాస్తవాలను ప్రజలకు వివరించి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే. ఇక డాక్యుమెంట్ రైటర్లు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి ఉపాధికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తాం" అని భరోసా ఇచ్చారు.

**- వివిధ అంశాలపై సీఎం కీలక ఆదేశాలు**

సమీక్షలో భాగంగా పలు ఇతర అంశాలపైనా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. 'దీపం-2.0' పథకం లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులను క్రమబద్ధంగా చేపట్టాలని, వీలైతే నిర్దిష్ట తేదీల్లో చెల్లింపులు చేసేలా చూడాలని సూచించారు. పౌరసరఫరాల, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, సాంకేతిక అంశాలను పరిశీలించి దీనిని అమలు చేయాలన్నారు. అదేవిధంగా, కేవలం ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రయోజనం లేని ఫిర్యాదులు చేసే 'లిటిగెంట్ పిటిషనర్ల'ను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. "రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 81 మందిని గుర్తించాం. ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.

వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపాలి. ప్రజాప్రయోజనం ఉన్న పిటిషన్లను తప్పక పరిశీలించాలి, కానీ దురుద్దేశంతో వేసే వాటిని గుర్తించాలి" అని అన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 49 శాతం వర్షపాత లోటు ఉందని, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వ్యూహాలు అన్వేషించాలని సీఎం సూచించారు. రైతుల్లో అవగాహన కల్పించి, మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు హైకోర్టు బ్రేక్

మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిపై తర్వాతి ఉత్తర్వులు ఇచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలతో పిటిషన్ దాఖలు చేసిన నలుగురు రైతులకు తాత్కాలికంగా ఊరట లభించింది. బహదూర్‌గూడలోని 28 ఎకరాల భూమిని గత 30 ఏళ్లుగా సాగు చేస్తున్నామని.. ఆ భూమి తమదేనని పేర్కొంటూ నలుగురు రైతులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో తమ హక్కులకు భంగం కలుగుతోందని రైతులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు.

పిటిషనర్లు చూపిస్తున్న పట్టాదారు పాస్‌పుస్తకాలపై అధికారుల సంతకాలు లేవని వారు అక్కడ సాగు చేస్తున్నారనే కారణంతో భూమి తమదని చెప్పడం సరైన ఆధారం కాదని పేర్కొన్నారు.ప్రభుత్వం కేవలం ప్రభుత్వ భూములకే ఫెన్సింగ్ వేస్తోందని పిటిషనర్లు పేర్కొంటున్న భూములను తాము ఆక్రమించలేదని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు అవసరమైన భూముల కేటాయింపు అంశం ఇటీవల వివాదానికి దారితీసింది. సుమారు 650 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు కోసం గుర్తించగా అందులో తమ భూములు కూడా ఉన్నాయని రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అధికారులు ఫెన్సింగ్ పనులు చేపట్టే ప్రయత్నం చేయడంతో రైతులు నిరసనలు చేపట్టగా, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# కొత్త లుక్‌లో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు

కొత్త లుక్‌లో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు.

**- అందుబాటులోకి 500 వాహనాలు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు.

ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక ఎస్యూవీ/ఎంయూవీ వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**- రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ**

వాహనాల్లో తల్లీ-శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు కార్యక్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు పాల్గొన్నారు.

# మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం

ఉన్నట్లు తెలిపాడు. తన వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని ఉదయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నాడు. ఆ లేఖలో ఉదయ్ కృష్ణారెడ్డి తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ తన వాదనను వివరించాడు. 2025 జూన్ నుంచి తాము శారీరకంగా, మానసికంగా సంబంధంలో ఉన్నానని ఆమెకు పెళ్లి అయిన తర్వాత కూడా ఆ సంబంధం కొనసాగిందని చెప్పాడు. ఆమె అనేకసార్లు తన గదికి స్వయంగా వచ్చేదని, వాట్సాప్ ద్వారా తలుపు తెరవాలని కోరేదని, వీటికి సంబంధించి తన వద్ద వీడియో, వాట్సాప్ చాట్ ఆధారాలు ఉన్నాయని లేఖలో ఉదయ్ కృష్ణారెడ్డి రాశాడు. ఈ క్రమంలోనే ఈనెల 9వ తేదీన కూడా ఆమె స్వయంగా తన గదికి వచ్చిందని తన అనుమతి లేకుండానే ముద్దులు, హగ్‌లు ఇచ్చి బలవంతం చేసిందని పేర్కొన్నాడు. ఆ తర్వాత జరిగిన విషయాలను వీడియోగా రికార్డు చేసి ఆమె భర్తకు పంపినట్లు పేర్కొన్నారు. తమ మధ్య మొదటి రోజు నుంచి జరిగిన చాట్‌లు, వీడియోలు సహా అన్ని ఆధారాలు తన ఐఫోన్‌లో ఉన్నాయని లేఖలో ఉదయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నాడు. ఆ ఆధారాలను పరిశీలిస్తే నిజాలు బయటపడతాయని తెలిపారు. ఈ క్రమంలోనే లేఖలో నలుగురి పేర్లను ప్రస్తావించాడు. ఆరోపణలు చేసిన మహిళతోపాటు ఆమె భర్త, మరో ఇద్దరు పేర్లను ప్రస్తావిస్తూ తాను ఆత్మహత్య చేసుకోవడానికి ఆ నలుగురే కారణమని ఆరోపించాడు. ఈ నలుగురిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూసైడ్ లేఖలో ఉదయ్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశాడు. ఈ సూసైడ్ లెటర్ ఇప్పుడు ఈ కేసులో కీలకంగా మారింది. మరోవైపు ఆత్మహత్యాయత్నం చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# రణరంగంగా మారిన "చలో సంసద్"

సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను కూడా నిలిపివేశారు. కార్యకర్తలను 'శాంతంగా ఉండాలని' సీజేపీ కోరింది. "మనల్ని అడ్డుకుంటున్నప్పటికి సంయమనం పాటించి, శాంతిని కాపాడండి. మనం శాంతి, ప్రేమతో మాత్రమే దీనిని గెలుస్తాం" అని ఆ పార్టీ పేర్కొంది. పార్లమెంట్ వద్ద ఆందోళనకు అనుమతి నిరాకరించిన పోలీసులు, పెద్ద సంఖ్యలో గుమిగూడి ఉండే సమూహాలను నిషేధించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించే ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు. ఇప్పటికే నిరాహార దీక్ష చేస్తోన్న ప్రముఖ సామాజికవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందజేస్తోన్న విషయం తెలిసిందే."ముందస్తు అనుమతితో జంతర్ మంతర్ వద్ద నిర్దేశించిన ప్రదేశంలో తప్ప, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మందితో నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, ఆందోళనలు, సమావేశాలు నిషేధం" అని ఎక్స్ (ట్విట్టర్)లో ఢిల్లీ పోలీసులు ఒక పోస్ట్ పెట్టారు. "పౌరులందరూ చట్టాన్ని గౌరవించాలి, ఎలాంటి అనధికారిక సమావేశాలు లేదా ప్రదర్శనలలో పాల్గొనవద్దు, శాంతిభద్రతల పరిరక్షణను కాపాడటంలో సహకరించాలి" అని ఢిల్లీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా రాజీవ్ చౌక్, జన్‌పథ్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, సేవా తీర్థ మెట్రో స్టేషన్లను తదుపరి ఆదేశాలు వచ్చేవరకు మూసివేయడంతో ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లలో కూడా గందరగోళం నెలకొంది. వందలాది మంది ప్రయాణికులు మెట్రో స్టేషన్లలో చిక్కుకుపోయారు. ఇదిలా ఉండగా, రాజీనామా డిమాండ్ వేళ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే సమయంలో సీజేపీతో చర్చలకు కేంద్రం ముందుకొచ్చినట్టు ఆ పార్టీ ప్రతినిధులు ప్రకటించారు. కేంద్ర మంత్రి జేడీ నడ్డాతో తమ తరఫున ఇద్దరు సమావేశమవుతారని తెలిపారు. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

# రేషన్ కార్డుదారులకు

## మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

**హైదరాబాద్** తెలంగాణ ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది.

పేదల ఆహార భద్రత కోసం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆదేశాలతో తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆగస్టు1 నుంచి లబ్ధిదారులకు ఈ మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

# పారదర్శకంగా పోలీస్ ఉద్యోగాల భర్తీ

## - డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్** పోలీస్ ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా నిర్వహిస్తామని డీజీపీ సీవీ ఆనంద్, తెలిపారు. పోలీస్ ట్రైనింగ్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా పోలీస్ రిక్రూట్మెం ట్ బోర్డు పనితీరు నియామకాల పురో గతిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ పోలీస్ రిక్రూట్ మెంట్‌లో ఇప్పటి వరకు ఒక్క పేపర్ లీక్ కూడా జరగలేద ని, ఇదే బోర్డు విశ్వస నీయతకు నిదర్శన మని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు.

పోలీసు నియామకాల్లో పార దర్శ కతకు తెలంగాణ ఆదర్శమని కొనియాడారు. సీసీటీఎన్ఎస్ జాతీయ స్థాయి బెంచ్‌మార్క్‌ను చేరుకోవాలంటే అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కొత్త టెక్నాలజీ వాడాలనీ, అన్ని యాప్‌లూ వినియోగించాలని చెప్పారు. రిక్రూట్మెంట్ ప్రక్రియను పారదర్శ కంగా, నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.2022-23లో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పోలీస్ నియామక ప్రక్రియ ద్వారా 16, 654 పోస్టులు భర్తీ చేసినట్టు వెల్లడిం చారు. ఇప్పటివరకు జరిగిన నియామకా ల్లో 95 శాతం కానిస్టే బుల్ పోస్టులు, 5 శాతం ఎస్ఐ పోస్టులే ఉన్నట్టు వివరించారు. 2025 నోటిఫికేషన్ల లో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, 1,743 డ్రైవర్ ఆపరే టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగు తోందని తెలిపారు. తొలిసారిగా నిర్వహిం చిన ఫింగర్ ప్రింట్ అండ్ ఫోరెన్సిక్ పోస్టుల నియామకం లో 60 పోస్టులకు 57 మంది ఎంపికయ్యా రని వివరించారు.రిక్రూట్మెంట్‌లో 33 శాతం రిజర్వేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, ఆరఎఫ్ఐడీ టెక్నాలజీ, మొబైల్ అండ్ ఈ-మెయిల్ రిజిస్ట్రేషన్, నెగెటివ్ మార్కింగ్ వంటి సంస్కరణలను వివరించారు. పోలీస్ ట్రైనింగ్, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ ఆధునికీకరణపై డీజీపీ పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో నూతన కమ్యూనికేషన్ సెట్లను డీజీపీ సి.వి. ఆనంద్ ఆవిష్కరించారు.

# కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## - ప్రత్యేకాధికారి పి. కవిత

**రామడుగు** రామడుగు మండలం వెధిర కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో కోనరావుపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో 6వ తరగతిలో -18 సీట్లు 7వ తరగతిలో-15 సీట్లు 9వ తరగతిలో-03 సీట్లు మొదటి సంవత్సరం(సిఇసి) గ్రూపులో-19 సీట్లు మొదటి సంవత్సరం (ఎంపీహెచ్డబ్ల్యు) గ్రూపులో-10 సీట్లు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థినుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి పి. కవిత తెలిపారు. ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పూర్తి వివరాల కొరకు వెదిర కోనరావుపేటలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సంప్రదించగలరని ప్రత్యేక అధికారి పి. కవిత పేర్కొన్నారు.

# దేశరాజుపల్లిలో డంపింగ్ యార్డు వద్దు

## - జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

**కరీంనగర్** కొత్తపల్లి మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా సోమవారం జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా. కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి మున్సిపాలిటీకి చెందిన చెత్త వాహనాలు ప్రతిరోజూ గ్రామంలోని డంపింగ్ యార్డులో చెత్తను వేయడం వల్ల దుర్వాసన, కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు.ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.


వెంటనే గ్రామంలో చెత్త డంపింగ్ నిలిపివేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లపెల్లి లచ్చయ్య, ఉపసర్పంచ్ ఎం.డి. హైదర్, వార్డు సభ్యులు, జై భీం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తూరి అరవింద్, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అక్రమ నిర్మాణాల అడ్డాగా మలక్‌పేట్ సర్కిల్

**- అనుమతి నాలుగు అంతస్తులకు... నిర్మాణం మాత్రం సెల్లార్‌తో కలిపి ఎనిమిది అంతస్తులు.?**

**- డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే భారీ ఉల్లంఘన.. అధికారులు చూసీ చూడనట్టేనా.?**









టౌన్ ప్లానింగ్ అధికారిని ముంతాజ్ బేగం




**మలక్ పేట్ (ప్రశ్న న్యూస్)** చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్ సర్కిల్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. వరుస ఫిర్యాదులు వచ్చినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్బర్‌బాగ్ డివిజన్‌లోని ఇంటి నంబర్ 16-2-51/F/2కు సంబంధించి జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ 10-04-2025న ఫైల్ నంబర్: 010858/GHMC/5015/CHRZ/2024-BP, పర్మిట్ నంబర్: 5150/GHMC/CHR/2025-BPతో భవన నిర్మాణ అనుమతి జారీ చేసింది. అధికారిక అనుమతి ప్రకారం సెల్లార్‌తో పాటు నాలుగు అంతస్తుల నిర్మాణానికే అనుమతి ఉన్నదని స్థానికులు పేర్కొంటున్నారు.అయితే ఆ అనుమతులను పూర్తిగా పక్కనబెట్టి సెల్లార్‌తో పాటు అదనంగా మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తూ మొత్తం సెల్లార్ ం 8 అంతస్తుల భారీ అక్రమ భవనం నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణం బహిరంగంగా కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ నిర్మాణం మలక్‌పేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి సుమారు 300 మీటర్ల దూరంలోనే కొనసాగుతోంది. ఇదే మార్గంలో డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు (ఏసీపీ) తరచూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ఇంత భారీ నిర్మాణ ఉల్లంఘన వారి దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం మౌనం పాటించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో అక్రమ నిర్మాణదారులకు ప్రోత్సాహం లభిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్, జోనల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకుని నిర్మాణ అనుమతులు, స్థలంలో జరుగుతున్న పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని అక్బర్‌బాగ్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీశైల దేవస్థానంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

**- ప్రశంసలు కురిపిస్తున్న భక్తులు**





**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** శ్రీశైల దేవస్థానానికి రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్, దర్శన టికెట్ల జారీ వంటి అనేక సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఉచిత దర్శనం, రూ.150, రూ.300 ప్రత్యేక దర్శనానికి వచ్చే భక్తులు రద్దీ కారణంగా కొంతసేపు కంపార్ట్‌మెంట్‌లలో వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు, చంటి బిడ్డలతో వచ్చిన తల్లులు సహా ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను దేవస్థానం కల్పిస్తోంది.భక్తులకు సకాలంలో తాగునీరు, ప్రసాదాలు, చిన్నారులకు అవసరమైన పాలు అందిస్తూ రుచి, శుచి, శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా, దేవస్థాన సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి అధికారులు, సిబ్బంది కలిసి పరిష్కరిస్తున్నారని భక్తులు చెబుతున్నారు. దేవస్థానం అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై హర్షం వ్యక్తం చేస్తూ అధికారులు, సిబ్బందికి భక్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# “3”పసిపిల్లలు మాయంపై పోలీసులు అయోమయం

**- ఆటో ఎక్కి కాచిగూడ రైల్వే స్టేషన్కు వెళ్లి ముగ్గురు బాలికల అదృశ్యం**

**- సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న దోమలగూడ పోలీసులు**

**- సిటిలో చిన్న పిల్లలు తస్మాత్ జాగ్రత్త,పిల్లలు పై తల్లిదండ్రులు నజర్ తప్పనిసరి**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముగ్గురు బాలికలు అదృశ్యమైన ఘటన దోమల గూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.దోమల గూడ ఇన్స్పెక్టర్ ఎండీ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీసఘడ్ రాష్ట్రానికి చెందిన టోటారాం,రాందులారి దంపతులు తమ ఇద్దరు కుమార్తెలు సహిత కుమారి (16),స్నేహ,కుమారి(14) లను తీసుకొని జీవనోపాధి కోసం రెండు నెలల క్రితం నగరానికి వచ్చారు.దోమల గూడ పీఎస్ పరిధిలోని ఫరీద్ బస్తీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ కూలీ పని చేసుకుంటున్నారు.వీరిద్దరి కుమార్తెలు చదువుకోవడం లేదు.ఇంటి వద్దే ఉంటున్నారు.వీరి పక్కింట్లో ఛత్తీసఘడ్కు చెందిన రోహిణి కుటుంబం నివాసముంటోంది.అంతా ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో రోహిణి కూతురు లత (14)తో మిగిలిన ఇద్దరు బాలికలు స్నేహంగా ఉండేవారు. అయితే,ఏం జరిగిందో తెలియదు కానీ..ఈ ముగ్గురు బాలికలు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బ్యాగులో దుస్తులు సర్దు కొని శనివారం సాయంత్రం మూడు గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వచ్చి హిమాయత్ నగర్ మెయిన్రోడ్లో ఆటో ఎక్కి వెళ్లిపోయారు.సాయంత్రం కూలీ పని ముగించుకొని ఇంటికి వచ్చినతల్లిదండ్రులకు సహితకుమారి, స్నేహకుమారి కని పించకపోడంతో పక్కనే ఉండే రోహిణిని అడిగితే,తమ కుమార్తె లత కూడా కనిపించడం లేదని చెప్పింది.దీంతో ఆందోళనకు గురైన ఇరుకుటుంబాల తల్లిదండ్రులు తమ కుమార్తెల కోసం చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆది వారం మధ్యాహ్నం తమ పిల్లలు కనిపించడం లేదని దోమలగూడ పీఎస్ లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు హిమాయత్నగర్ మెయిన్రోడ్పై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా, ముగ్గురు బాలికలు ఆటో ఎక్కినట్టు తేలింది. సాయంత్రం 4.30కి కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఆటో దిగినట్లు పోలీసులు నిర్ధారించారు.అయితే, బాలికలు రైల్వే స్టేషన్లో రైలు ఎక్కి వెళ్లారా లేక మరెటైనా వెళ్లిపోయారా అనేది తెలియాల్సి ఉంది. బాలికలు అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దోమలగూడ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశామని సీఐ అంజద్ అలీ తెలిపారు.

### పిల్లలు పై తల్లిదండ్రులు నజర్ తప్పనిసరి పోలీసులు:

భాగ్యనగరంలో కోటికి పై చిలుకు ఉన్న జనాభాలో దాదాపు పిల్లలు సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నది.కానీ పసి పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ ఆప్యాయత దూరం అయినప్పుడే ఇల్లు వదిలి బయటకు వెళ్లాలనే ఆలోచన వారిలో బలంగా నాటు కుంటుంది.పేరెంట్స్ ఎప్పుడు పల్లల పట్ల దురుసుగా ప్రవర్తించ్చవద్దు.కోపంతో వారి పై చెయ్యి చేసుకోకూడదు.ఈ రోజుల్లో పిల్లలు ప్రతి చిన్న విషయానికి హర్ట్ అవుతూ ఇంటి నుంచి వెళ్లిపోవడమే కాకుండా ప్రాణం మీదికి తెచ్చుకునే సంఘటనలు నగరంలో కోకొల్లలుగా నిలుస్తున్నాయి.దయ చేసి ఆ పసి హృదయాలతో కాసేపు సమయం కేటాయిస్తూ వారిని అర్థం చేసుకుంటే గాని అప్పుడు ఎవ్వరి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి.

## పారిశుద్ధ కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి: తుడుం శ్రీనివాస్

**- పీఫ్ / ఈ ఎస్ ఐ అవగాహన శిబిరం, వారానికి ఒక రోజు సెలవు కల్పించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి**



కీసర(ప్రశ్న న్యూస్) కీసర డివిజన్-1 పరిధిలోని పారిశుద్ధ కార్మికుల సంక్షేమం కోసం సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. 90 మందికి పైగా కార్మికులకు పీఫ్, ఈ ఎస్ ఐ పై అవగాహన శిబిరం నిర్వహించడంతో పాటు రక్షణ పరికరాలు అందించాలని కోరారు. అలాగే తెలంగాణ కోడ్ ఆన్ వేజెస్ రూల్స్ --2021 ప్రకారం వారానికి ఒక రోజు లేదా నెలకు నాలుగు రోజుల విశ్రాంతి దినం కల్పించి, కార్మికుల హక్కులు, ఆరోగ్య భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## కొత్తగా విలీనమైన మున్సిపాలిటీలకు 20 వేల లీటర్ల ఉచిత నీటి పథకం అమలు చేయాలి

**- జవహర్‌నగర్ డంప్‌యార్డ్ వల్ల నీటి కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి మాజీ ఛైర్మన్ చంద్రారెడ్డి వినతి**




ఘట్కేసర్ ( ప్రశ్న న్యూస్) కొత్తగా జీహెచ్‌ఎంసీలో విలీనమైన మున్సిపాలిటీలకు కూడా నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని అమలు చేయాలని నాగారం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్, భాజపా సీనియర్ నాయకులు కౌకుట్ల చంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. జవహార్‌నగర్ డంప్‌యార్డ్ కారణంగా కీసర, నాగారం సర్కిళ్లలో నీటి కాలుష్యం, దుర్వాసన, పర్యావరణ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఉచిత నీటి పథకాన్ని విస్తరించడంతో పాటు డంప్‌యార్డ్ వల్ల ఏర్పడుతున్న కాలుష్య సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## మెదక్ కలెక్టరేట్ ఎదుట ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా మహాధర్నా

**- రంగాయిపల్లి--చెట్ల గౌరారం గ్రామాల ప్రజల ఆందోళన.. బీఆర్ఎస్ నేతల సంఘీభావం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ పరిశ్రమ వల్ల విషపూరిత కాలుష్యంతో తమ గ్రామాల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని ఆరోపిస్తూ రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. “చలో కలెక్టరేట్” పిలుపుతో పెద్ద ఎత్తున తరలివచ్చిన గ్రామస్థులు పరిశ్రమను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాకు మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి హాజరై గ్రామ ప్రజలకు సంఘీభావం తెలిపారు.ధర్నాలో పాల్గొన్న ప్రజలు “ఎంఎస్ అగర్వాల్ కంపెనీని తొలగించాలి”, “మా ప్రాణాలు కాపాడాలి”, “కాలుష్య పరిశ్రమ మాకు వద్దు” అంటూ నినాదాలు చేశారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ సందర్భంగా మాట్లాడిన పద్మా దేవేందర్ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా పరిశ్రమ నుంచి వెలువడుతున్న జల, వాయు, నేల కాలుష్యం కారణంగా గ్రామాల్లో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. చర్మవ్యాధులు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు పెరిగాయని, వందలాది మంది మృతి చెందగా, వేలాది మంది అనారోగ్యానికి గురయ్యారని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న పరిశ్రమపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, సంస్థ యాజమాన్యం చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగిస్తోందని విమర్శించారు. గ్రామాల ప్రజలు శాంతియుతంగా ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించేందుకు వచ్చిన గ్రామస్థులను కార్యాలయంలోకి అనుమతించకుండా అడ్డుకోవడాన్ని వారు ఖండించారు. ప్రభుత్వం, అధికారులు ప్రజల పక్షాన నిలవాలా, కంపెనీ పక్షాన నిలవాలా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్రామాల్లో కాలుష్యం కారణంగా తాగునీరు, వ్యవసాయం, నివాసం వంటి ప్రాథమిక అవసరాలే సంక్షోభంలో ఉన్నాయని, పెళ్లిళ్లు కూడా జరగని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించే చర్యలు ప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ మహాధర్నాలో రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు వేదికగా డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)**ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ( ఆర్ టీ సి ) మేడ్చల్ డిపో ఆధ్వర్యంలో డయల్ యువర్ డిపో మేనేజర్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీమతి పరిమళ తెలిపారు.
ఈ కార్యక్రమం జూలై 21 (మంగళవారం) మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 1.00 గంట వరకు మేడ్చల్ డిపోలో నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు బస్సుల సమయపాలన, కొత్త సర్వీసుల అవసరం, ప్రయాణ సౌకర్యాలు, సిబ్బంది ప్రవర్తన, టికెట్ సేవలు తదితర అంశాలపై తమ సూచనలు, ఫిర్యాదులు, అభిప్రాయాలను 99592 26152 నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా తెలియజేయాలని ఆమె కోరారు. ప్రయాణికుల సూచనలను స్వీకరించి, సాధ్యమైన మేరకు తక్షణ చర్యలు తీసుకుని ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని డిపో మేనేజర్ శ్రీమతి పరిమళ తెలిపారు. అలాగే మేడ్చల్ డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్లే వరి పొలాలయ్యాయి

- గుంతల్లో వరి నాట్లు వేసి బీఆర్ఎస్ వినూత్న నిరసన
- సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం పాలనకు అర్హత లేదు: భాస్కర్ యాదవ్ ఫైర్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ పట్టణంలోని రోడ్ల దుస్థితిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న ఆందోళన చేపట్టారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షపు నీటితో నిండిన గుంతల్లో స్థానిక మహిళలతో కలిసి వరి నాట్లు వేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, మేడ్చల్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో విలీనం అయిన తర్వాత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆరోపించారు. హౌసింగ్ బోర్డు కాలనీ, కేఎల్ఆర్ వెంచర్, కిందిబస్తీ, బాలాజీ నగర్, ఉమా నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ కారణంగా ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారని విమర్శించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి కనీస పారిశుద్ధ్య చర్యలు కూడా అధికారులు చేపట్టడం లేదని మండిపడ్డారు. ఏసీపీ కార్యాలయం, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, పశువైద్యశాల, వ్యవసాయ శాఖ కార్యాలయం, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, బాలికల పాఠశాల, రైల్వే స్టేషన్ వంటి కీలక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదేనని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించిన భాస్కర్ యాదవ్, "ఇంట్లో పూరీలు చేయడం మానేసి తెలంగాణ రాష్ట్ర పాలనపై దృష్టి పెట్టండి" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దయానంద్ యాదవ్, నవీన్ రెడ్డి, విష్ణుచారి, నడికొప్పు నాగరాజు, సందీప్ గౌడ్, శంకర్, పద్మతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు

# మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా రాగం అర్జున్

– పార్టీని బలోపేతం చేసి మేడ్చల్‌లో జెండా పాతడమే లక్ష్యం : రాగం అర్జున్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా రాగం అర్జున్ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధినాయకత్వానికి, జిల్లా నేతలకు ఆయన ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కొండే, మేడ్చల్ జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు పి. విక్రమ్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ పటేల్, అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు రాగం అర్జున్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

### పార్టీ బలోపేతానికి నిరంతర కృషి : రాగం అర్జున్

నాపై ఎంతో నమ్మకంతో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ యువమోర్చా బాధ్యతలను అప్పగించారు. మనసా, వాచా, కర్మణా తూచా తప్పకుండా పెద్దల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతాను. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా, మేడ్చల్ జిల్లాలో కూడా బీజేపీ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా అడుగులు వేస్తాను. దైవసాక్షిగా ప్రమాణం చేస్తూ, పార్టీ ఎదుగుదల కోసం శ్రమిస్తానని తెలియజేస్తున్నానని తెలిపారు. దీంతో యువమోర్చా అధ్యక్షుడిగా రాగం అర్జున్ నియామకం పట్ల బీజేపీ శ్రేణులు, యువత తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మేడ్చల్ జిల్లాలో యువమోర్చా ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# శనివారం సంతకు శ్రీకారం: పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు

- ప్రజల ఇబ్బందులకు పరిష్కారం: చుట్టుపక్కల గ్రామాలకు ఉపయోగం
- వ్యాపారులకు గ్రామస్తుల ఆహ్వానం: రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యం



**ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)** మండల కేంద్ర ప్రజల చిరకాల డిమాండ్ నెరవేరనుంది. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సంత నిర్వహించాలని నిర్ణయించారు. పాత బస్టాండ్ వెనుక ఉన్న కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో ఈ సంత కొనసాగనుంది. సంత లేకపోవడంతో ఏటూరునాగారం పరిసర గ్రామాల ప్రజలు కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయడానికి చిన్నబోయినపల్లి, పసర, కమలాపురం వంటి గ్రామాలకు వెళ్లాల్సి వస్తుండేది. దీంతో సామాన్యులకు ఆర్థికంగా, సమయపరంగా ఇబ్బందులు తప్పేవి కావు. ఈ సమస్యకు పరిష్కారంగా గ్రామపంచాయతీ సంత ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

### గ్రామ పంచాయతీ కార్యదర్శి వాసం జనార్ధన్ మాట్లాడుతూ..



ఏటూరునాగారం మండల కేంద్రంలో సంత లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు, పండ్ల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజల సౌకర్యార్థం పాత బస్టాండ్ వెనుక ప్రతి శనివారం సంతను ఏర్పాటు చేస్తున్నాం. రైతులకు మంచి గిట్టుబాటు ధర, ప్రజలకు నాణ్యమైన వస్తువులు, వ్యాపారులకు మంచి వ్యాపారం అందించడమే మా లక్ష్యం. ప్రజలందరూ ఈ సంతను సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని కోరుతున్నాం" అని అన్నారు.

### వ్యాపారులకు స్వయంగా ఆహ్వానం.

సంతను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు ఒక బృందంగా ఏర్పడి ముందడుగు వేశారు. తాడూరి రఘు, పెంద్యాల ప్రభాకర్, నూతి రమేష్, గండేపల్లి నరసయ్య తదితరులు కమలాపురం వారాంతపు సంతను సందర్శించారు. అక్కడ కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు విక్రయించే వ్యాపారులను స్వయంగా కలిసి ఏటూరునాగారం శనివారం సంతకు రావాలని ఆహ్వానించారు.
వ్యాపారులకు అవసరమైన అన్ని రకాల సహకారం గ్రామపంచాయతీ అందిస్తుందని, స్థానికంగా మంచి ఆదరణ లభిస్తుందని వారు వివరించారు. ఈ పిలుపుకు వ్యాపారులు కూడా సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. సంత ప్రారంభంతో ఏటూరునాగారం చుట్టుపక్కల 20కి పైగా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శనివారం జరిగే ఈ సంతను ప్రజలందరూ ఆదరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# మేడ్చల్ సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సర్ అవగాహన కార్యక్రమం

- ఓటర్ నమోదు పత్రాలను పంపిణీ చేసిన బీఎల్ఓ
- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా కోశాధికారి పిలుపు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని సైబరాబాద్ కార్పొరేషన్ 57, 58, 59 బూత్‌లలో బిఎల్ఓ అధికారుల ఆధ్వర్యంలో ఓటర్ల ఎన్యుమరేషన్ కార్యక్రమం వేగవంతంగా జరిగింది. ఈ సందర్భంగా అధికారుల సమక్షంలో స్థానిక ప్రజలకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా కోశాధికారి లవంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పౌరులందరూ తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎన్యుమరేషన్ పత్రాలను పూర్తి చేసి బిఎల్ఓ అధికారులకు సకాలంలో అందజేయడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత కీలకమైనది. ఎన్యుమరేషన్ పత్రాలను సరిగ్గా నింపి అధికారులకు ఇచ్చి, మీ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్, బీజేపీ నాయకులు ప్రవీణ్, వాణి, రామచందర్, స్థానిక కాలనీ వాసులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కృషి ఫలించింది

- హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతి
- రూ.49 లక్షల వ్యయంతో పనులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ పట్టణ ప్రజల కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. 297వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి పరిపాలనాపరమైన ఆమోదం లభించింది. మేడ్చల్ పురపాలక మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ నిరంతర కృషి, సంబంధిత అధికారులతో జరిపిన సమర్థవంతమైన ఫాలోఅప్ ఫలితంగానే ఈ అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (కుత్బుల్లాపూర్ జోన్, సర్కిల్–60) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుండి లెక్చర్ ఆఫ్ అక్సెప్టెన్స్ జారీ అయ్యింది. 297వ వార్డులో హౌసింగ్ బోర్డ్ నుండి లైబ్రరీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 49.00 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రానున్న 3 నెలల్లో పనులు పూర్తి చేయాలన్నారు.

### ప్రజా సంక్షేమమే నా ధ్యేయం : చీర్ల రమేష్

హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన రోడ్డు సమస్యను తీర్చేందుకు అధికారుల చుట్టూ తిరిగి, నిరంతరం వినతులు సమర్పించాను. నా కృషి ఫలించి రూ. 49 లక్షల నిధులు మంజూరు కావడం ఎంతో సంతోషాన్నిస్తోంది. మేడ్చల్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నా ప్రథమ కర్తవ్యం. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాగే నిరంతరం శ్రమిస్తాను. రోడ్డు నిర్మాణానికి అనుమతి రావడంతో హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు, స్థానిక ప్రజలు చీర్ల రమేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నూతన కాంగ్రెస్ మండల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గాదె నరేష్ కు సన్మానం



**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల పెద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంఘ పెద్ద మనుషులు సభ్యులు ఇటీవల నూతన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గాదె నరేష్ కు మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయిలు తినిపించి శాలువా తో సన్మానించారు. సంఘ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సహకారంతో సంఘ అభివృద్ధి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సభ్యులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ధైర్యం, సాహసంతోనే విజయం

- మాజీ మంత్రి మల్లారెడ్డి
- ప్రజల ఆశీస్సులతోనే ఉన్నత స్థానాలకు విద్యా విప్లవంతోనే దేశాభివృద్ధి సాధ్యం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ధైర్యం, సాహసమే లక్ష్యంగా ముందుకు సాగినప్పుడే విజయం లభిస్తుందని, తాను ఛత్రపతి శివాజీ మహారాజ్ చూపిన బాటలోనే పయనించి జీవితంలో సక్సెస్ అయ్యానని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. గుండ్లపోచంపల్లి, మైసమ్మగూడ, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో తన చిన్నతనంలో పడిన కష్టాలను, పెరిగిన విధానాన్ని ఆయన ఈ సందర్భంగా ఆత్మీయంగా గుర్తుచేసుకున్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తాను చిన్నతనంలో సైకిల్‌పై పాలు అమ్మడం, మైసమ్మగూడలో పూలతోటలు సాగు చేయడం వంటి కష్టపడే తత్వంతోనే సమాజంలో ఎదిగానని తెలిపారు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని గ్రామాల్లో ఎన్నికలకు ముందే రోడ్లు వేయించి, బతుకమ్మ, బోనాలు చేసుకునే ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించామని వివరించారు. కోనాయిపల్లి గ్రామంలో శివాజీ యూత్ సభ్యుల కోరిక మేరకు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించామని, దీనికి స్థానిక నాయకురాలు నిషితమ్మ మూడు లక్షల రూపాయలు వెచ్చించడం అభినందనీయమన్నారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పోరాడి రాబోయే రోజుల్లో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

### ఛత్రపతి శివాజీ మార్గం అందరికీ ఆదర్శం

- ఎల్లంపేట పురపాలక సంఘం చైర్మన్ శ్రీదేవి

ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ధైర్యం, దేశభక్తి మరియు గొప్ప నాయకత్వ లక్షణాలకు ప్రతీక అని, ఆయన నడిచిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఎల్లంపేట పురపాలక సంఘం చైర్మన్ శ్రీదేవి పిలుపునిచ్చారు. గ్రామంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డికి ఆమె సభాముఖంగా సాదర స్వాగతం పలికారు. సభకు విచ్చేసిన గ్రామ ప్రజలకు, స్థానిక నాయకులకు, అమ్మలకు, నాన్నలకు మరియు పెద్దలందరికీ తన హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ జీవన విధానం ప్రతి ఒక్కరిలోనూ ధైర్యాన్ని, దేశభక్తిని మరియు నాయకత్వ పటిమను పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట పురపాలక సంఘం చైర్మన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ మేకల రజితదేవేందర్ రెడ్డి, ఎల్లంపేట పురపాలక సంఘం కౌన్సిలర్లు మరియు మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైస్ ఎంపీపీ గోపి వెంకటేష్, మాజీ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీర్లపల్లి రజితరాజమల్లారెడ్డి, వీర్లపల్లి భాగ్యరెడ్డి, ఎల్లంపేట పురపాలక సంఘం అధ్యక్షుడిగా సుదర్శన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆకిటి నవీన్ రెడ్డి, గుంటి కుమార్ ముదిరాజ్, గుంటి దీపక్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కోనాయిపల్లి గ్రామ శివాజీ యూత్ సభ్యులు, హిందూ బంధువులు, యువకులు, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, స్థానికులు భారీ ఎత్తున పాల్గొని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కీసరలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 12 మంది అరెస్ట్.. నగదు, మొబైల్ ఫోన్లు, పేకాట కట్టలు స్వాధీనం



**కీసర( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్--మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత జూదం నిర్వహిస్తున్న ముఠాపై పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జూలై 19న ఆర్జీకే డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్–1, బ్లాక్ నెం.1, 5వ అంతస్తులోని గది నెం.501పై దాడి నిర్వహించగా, నగదు పందెంతో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఎం.జీ. బేగ్ జూదం నిర్వహిస్తుండగా, ఎం.డి. అమీరుద్దీన్ సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రూ.16,900 నగదు, 19 పేకాట కట్టలు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

# మునగాకు వల్ల లాభాలు

**- నరాల బలహీనత, రక్తహీనత, షుగర్,బీపీ కంట్రోల్కు ఇంటి చిట్కా, అదే మన పెరట్లో దొరికే మునగాకు**



మన ఇంటి పెరట్లో కనిపించే చెట్టు మునగ చెట్టు. అయితే మనం పెద్దగా పట్టించుకోని ఈ మునగాకులో ప్రకృతి దాచిన అద్భుతమైన రహస్యం ఉంది. ఈ రోజుల్లో జీవనశైలి, ఒత్తిడి వల్ల వయసుతో సంబంధం లేకుండా చాలా మందని వేధిస్తున్న సమస్య నరాల బలహీనత.

చేతులు వణకడం, కాళ్లు తిమ్మిర్లు రావడం, కాస్త నడవగానే అలసిపోవడం వంటి సమస్యలతో బాధపడేవారికి, అనేక అనారోగ్య సమస్యలకు మునగాకు గొప్ప ఔషధంలా పనిచేస్తుందని ఐ జే ఎం ఎస్ అధ్యయనం పేర్కొంది. పాలు, క్యారెట్లు, నారింజ పండ్ల కంటే అనేక రెట్లు ఎక్కువ పోషకాలు ఉండే ఈ మునగాకును ఆయుర్వేదంలో సూపర్ఫుడ్ అంటారు.నేటి ఆధునిక కాలంలో యాంటీబయోటిక్స్, విటమిన్ టాబ్లెట్ల కోసం మెడికల్ షాపుల చుట్టూ తిరిగే మనం మన పెరట్లో దాగున్న అమృతాన్ని గమనించడం లేదు. అదే సూపర్ ఫుడ్ అని పిలిచే మునగాకు. ఇది నరాల బలహీనతతో సతమతమవుతూ, శరీరం నిత్యం అలసటగా అనిపిస్తుంటే దానికి కారణం శరీరంలో పోషకాల లోపమే. అయితే ఈ సమస్యకు ఖరీదైన మందులు అవసరం లేదు. గుప్పెడు మునగాకు చాలు. ఇందులో ఉండే పోషకాలు నరాలకు రీఛార్జ్ పనిచేసి శరీరానికి కొత్త ఉత్తేజాన్ని ఇస్తాయి.మన ఇంటి పెరట్లో కనిపించే చెట్టు మునగ చెట్టు. అయితే మనం పెద్దగా పట్టించుకోని ఈ మునగాకులో ప్రకృతి దాచిన అద్భుతమైన రహస్యం ఉంది. ఈ రోజుల్లో జీవనశైలి, ఒత్తిడి వల్ల వయసుతో సంబంధం లేకుండా చాలా మందని వేధిస్తున్న సమస్య నరాల బలహీనత.చేతులు వణకడం, కాళ్లు తిమ్మిర్లు రావడం, కాస్త నడవగానే అలసిపోవడం వంటి సమస్యలతో బాధపడేవారికి, అనేక అనారోగ్య సమస్యలకు మునగాకు గొప్ప ఔషధంలా పనిచేస్తుందని ఐ జే ఏం ఎస్ అధ్యయనం పేర్కొంది. సాలు, క్యారెట్లు, నారింజ అధ్యయనం పేర్కొంది. పాలు, క్యారెట్లు, నారింజ పండ్ల కంటే అనేక రెట్లు ఎక్కువ పోషకాలు ఉండే ఈ మునగాకును ఆయుర్వేదంలో సూపర్ఫుడ్ అంటారు.

### నరాల బలానికి మునగాకు:

నరాల బలహీనత ఉన్న వారికి మునగాకు సంజీవని లాంటిది. ఆయుర్వేదంలో మునగాకునే అద్భుతమైన ఔషధంగా భావిస్తారు. కేవలం నరాల బలానికి మాత్రమే కాకుండా మొత్తం శరీర ఆరోగ్యానికి ఇది ఒక సూపర్ ఫుడ్గా పనిచేస్తుంది. నరాల పనితీరును సజావుగా సాగడానికి, మెదడు నుంచి శరీరీ భాగాలకు సంకేతాలు సరిగా అందడానికి విటమిన్ బీ చాలా అవసరం.మునగాకులో విటమిన్ బీ (దీ1, దీ6, దీ12) పుష్కలంగా ఉంటుంది.

శరాలు, కండరాల మధ్య సమన్వయం దెబ్బతిన్నప్పుడు చేతులు, కాళ్లు వణకడం లేదా తిమ్మిర్లు రావడం జరుగుతుంది. మునగాకులోని మెగ్నీషియం నరాలను ప్రశాతం పరిచి ఈ సమస్యలను తగ్గిస్తుంది. అలాగే మునగాకులో ఉండే క్వెర్సిటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు నరాల కణాలు దెబ్బతినకుండా కాపాడుతాయి.

### రక్తహీనత నివారణ:

మునగాకులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మునగాకును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలు పెరిగి రక్తహీనత సమస్య త్వరగా తగ్గుతుంది. నీరసం, అలసట మాయమవుతాయి.

### ఎముకల బలం:

మునగాకులో పాల కంటే 4 రెట్లు ఎక్కువ కాల్షియం, ఫాస్పరస్ ఉంటాయి. ఇవి ఎముకలను, పళ్లను దృఢంగా ఉంచుతాయి. కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులతో బాధపడే వారికి ఇది చాలా మంచిది.

### షుగర్, బీపీ నియంత్రణ

మునగాకులో ఉండే ఐసోథియోసైనేట్లు రక్తంలో షుగర్ లెవల్స్ పెరగకుండా అదుపులో ఉంచుతాయి.

అలాగే మునగాకులో ఉండే పొటాషియం బీపీని కూడా క్రమబద్ధీకరిస్తుంది. అయితే బీపీ, షుగర్ మందులు తీసుకుంటున్న వాళ్లు డాక్టర్ సలహా మేరకు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

### కంటి చూపు మెరుగు:

క్యారెట్ల కంటే మునగాకులో విటమిన్ ఏ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది రేచీకటిని నివారించడమే కాకుండా వయసు పెరగడం వల్ల వచ్చే కంటి సమస్యలను తగ్గిస్తుంది. అంతే కాకుండా ఇందులో ఉండే విటమిన్ సీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మెండుగా ఉంటాయి. ఇవి శరీరానికి ఇన్ఫెక్షన్లు, వైరస్లతో పోరాడే శక్తిని ఇస్తాయి.

### స్కిన్, హెయిర్ కేర్కి కూడా:

మునగాకు రక్తాన్ని శుద్ధి చేయడం వల్ల మొటిమలు తగ్గి చర్మం కాంతి వంతంగా మారుతుంది.

అలాగే ఇందులో ఉండే పోషకాలు జుట్టు రాలడాన్ని తగ్గించి జుట్టు బలంగా పెరిగేలా చేస్తాయి. అందుకే బ్యూటీ, హెయిర్ కేర్ ప్రొడక్ట్స్లో మునగాకును కూడా ఉపయోగిస్తారు.

### దీనిని ఎలా తీసుకోవాలంటే?

మునగాకును నీడలో ఎండబెట్టి పొడి చేసి నిల్వ చేసుకోవాలి. ఈ పొడిని రోజుకు ఒక స్పూన్ను గోరువెచ్చని నీటిలో గానీ, మజ్జిగలో గానీ లేదా కూరల్లో కానీ వేసుకుని తినొచ్చు. అలాగే గుప్పెడు మునగాకులను శుభ్రం చేసి నీటిలో బాగా మరిగించి వడకట్టి ఆ కషాయాన్ని తీసుకోవచ్చు.

# ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఫైల్ ఎందుకు పెండింగ్

**- కలెక్టర్కు మెమో ఇచ్చిన బీజేపీ కిసాన్ మోర్చా**

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిపై విమర్శలు.**

**ములుగు జిల్లా (ప్రశ్న న్యూస్)** ఏటూరునాగారం మండలానికి రెవిన్యూ డివిజన్గా ఆమోదించడంలో జరుగుతున్న జాప్యంపై బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జాడి రామరాజు నేత సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు.

ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం వెంటనే వివరించాలని, రెవిన్యూ డివిజన్ ఆమోదానికి చర్యలు తీసుకోవాలని మెమోలో కోరారు. కొంతమంది రాజకీయ నాయకులు మైదాన ప్రాంత నాయకుల ఒత్తిడితో ఈ ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

2023 సెప్టెంబర్లో బీజేపీ ఆధ్వర్యంలో రెవిన్యూ డివిజన్ కోసం నిరాహార దీక్ష చేసి సాధించామని, అదే ఏడాది అక్టోబర్ 7న అప్పటి ప్రభుత్వం జీవో విడుదల చేసిందని గుర్తు చేశారు.

### రైతులకు ఊరట.

ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం అనే 6 మండలాల్లో 35 వేల మంది రైతులకు చెందిన 92 వేల ఎకరాల భూమి సమస్యలు రెవిన్యూ డివిజన్ ఏర్పాటుతో పరిష్కారమవుతాయని తెలిపారు. రెవిన్యూ డివిజన్ వస్తే దళిత, బహుజన, మైనార్టీ వర్గాల రైతుల భూములకు రక్షణ లభిస్తుందన్నారు.ప్రస్తుతం డివిజన్ లేకపోవడంతో అధికారులు అందుబాటులో లేరని, దీంతో ఏటా చట్టాల పేరుతో వెయ్యి ఎకరాల వరకు దళిత, బహుజన రైతుల భూములు కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదాన ప్రాంతాలకు నీళ్లు తరలిస్తున్నా, 78 వేల మంది సన్న, చిన్నకారు రైతులు సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిపై విమర్శలు.

నేటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారా, లేక మంత్రి కి గూఢచారిగా ఉంటారా అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిని రామరాజు నిలదీశారు. 2023లో రెవిన్యూ డివిజన్ ప్రకటన సమయంలో పాలాభిషేకాలు చేసిన నాయకులు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం బీఆర్ఎస్.సిపిఐ.సీపీయం. కాంగ్రెస్ తో పాటు ఆదివాసీ.దళిత. బహుజన. మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు కూడా గళమెత్తాలని కోరారు.

### అధికారుల స్పందన:

ఈ అంశంపై కలెక్టర్ కార్యాలయం నుండి ఇంకా అధికారిక స్పందన రాలేదు. ప్రభుత్వం నుండి త్వరలో స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

**ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ వల్ల లాభాలు.**



ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం – 6 మండలాలు
సుమారు 35 వేల మంది రైతులు 92 వేల ఎకరాల పోడు, వ్యవసాయ భూముల సమస్యల పరిష్కారం దళిత, బహుజన, మైనార్టీ రైతుల భూములకు రక్షణ, రెవిన్యూ సేవలు సులభతరం

## గజ్వేల్లో ఘనంగా ముగిసిన డివిజన్ స్థాయి చెస్ పోటీలు

**- అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానం -- క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు పిలుపు**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన డివిజన్ స్థాయి చెస్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్వామి వివేకానంద సేవాసమితి--గజ్వేల్, రాచకొండ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్--గజ్వేల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్--గజ్వేల్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల ముగింపు వేడుకలు అట్టహాసంగా జరిగాయి.ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. గెలుపు--ఓటములు సహజమని, ప్రతి పోటీని స్ఫూర్తిగా తీసుకుని మరింత ముందుకు సాగాలని అన్నారు.ప్రస్తుతం క్రికెట్, కబడ్డీ వంటి క్రీడలకు అధిక ప్రాధాన్యం లభిస్తున్న తరుణంలో, ఇండోర్ గేమ్స్ అయిన చెస్కు ప్రోత్సాహం అందిస్తూ గజ్వేల్ స్థాయిలో పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు హరీష్ రెడ్డితో పాటు నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్త చంటి, బెలిదే మణికంఠ, రాచకొండ ప్రశాంత్, నవీన్ గౌడ్, లింగ శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, యాదగిరి, మహేష్, సామాజిక కార్యకర్త సాధక్ పాషా, లాకేష్, వెంకటరామిరెడ్డి, గంగిశెట్టి నర్సింలు, కైలాస ప్రశాంత్, జ్ఞానేశ్వర్ రెడ్డి, వినయ్, ప్రవీణ్, భానురి, రేష్మా, పవిత్ర, ప్రగతి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, క్రీడాభిమానులు, నిర్వాహక కమిటీ సభ్యులు హాజరై పోటీలను విజయవంతం చేశారు.

## కుక్కల బారి నుంచి నెమలిని కాపాడిన యువకులు

**- గజ్వేల్ పోలీసులు అటవీ శాఖకు అప్పగింత**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పట్టణంలోని పటేల్ బజార్ సమీపంలోని పోచమ్మ దేవాలయం వద్ద కుక్కల బారి నుంచి ఓ నెమలిని స్థానిక గ్రామస్తులు అప్రమత్తంగా కాపాడారు. సమాచారం అందుకున్న గజ్వేల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో నెమలిని సురక్షితంగా రక్షించారు.అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలో నెమలిని అప్పగించారు. పోలీసుల తక్షణ స్పందనతో పాటు గ్రామస్తుల చొరవ వల్ల జాతీయ పక్షి నెమలి ప్రాణాలతో బయటపడింది. ఈ సందర్భంగా స్థానికులు పోలీసుల సేవలను అభినందించారు.

## గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు( ప్రశ్న న్యూస్)** కరాటే పోటీలలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభినందించారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో బీరంగూడకు చెందిన క్రేజీ క్రూ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చిన్నారులను జిఎంఆర్ అభినందించారు. విద్యార్థి స్థాయి నుండి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివా రెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ, అకాడమీ నిర్వాహకులు సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 19న పటాన్చెరు యాదవ సంఘం ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు ( ప్రశ్న న్యూస్)** పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన యాదవ సంఘం కళ్యాణ మండపాన్ని ఆగస్టు 19న ప్రారంభించబోతున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మాజీ ప్రజా ప్రతినిధులు, యాదవ సంఘం ప్రతినిధులు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఫంక్షన్ హాల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పటాన్చెరు పట్టణంలోని యాదవుల కోసం ఆధునిక హంగులతో, పూర్తి సౌకర్యాలతో కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలకు అనుగుణంగా ఆగస్టు 19న కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపానదేవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, డిఈ కృష్ణవేణి, యాదవ సంఘం అధ్యక్షులు దేవయ్య యాదవ్, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించిన సీపీ శ్వేత

**- అవుట్పోస్టు రికార్డులు డి-అడిక్షన్ కేంద్రం పరిశీలన**

**- పార్కింగ్, సీసీ కెమెరాలపై అధికారులకు ఆదేశాలు**




వరంగల్ (ప్రశ్న న్యూస్)ఎంజీఎం ఆస్పత్రిలో భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలను పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు.ఆస్పత్రికి చేరుకున్న సీపీ ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్పోస్టును తనిఖీ చేశారు. మెడికో లీగల్ కేసులకు సంబంధించి సిబ్బంది చేపడుతున్న చర్యలు, కేసుల వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. విధుల్లో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా ఉండాలని సూచించారు.అనంతరం ఆస్పత్రిలోని డి-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు. మత్తు పదార్థాలకు బానిసైన యువతకు అందిస్తున్న చికిత్స విధానం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వ్యసనాల నుంచి యువతను సాధారణ జీవితంలోకి తీసుకొచ్చేందుకు మరింత కృషి చేయాలని వైద్య బృందానికి సూచించారు.ఎంజీఎం ఆస్పత్రి పరిసరాలను కూడా సీపీ పరిశీలించారు. ప్రధాన మార్గం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రధాన ద్వారం వద్ద ఆటోలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించాలని సూచించారు.

# ‘గేదెలరాజు’ మూవీ రివ్యూ!



నటుడిగా .. గాయకుడిగా .. సంగీత దర్శకుడిగా రఘు కుంచెకి మంచి పేరు ఉంది. ఈ మధ్య కాలంలో ఆయన నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్రలను ఎక్కువగా చేస్తూ వెళుతున్నాడు. ముఖ్యంగా విలేజ్ నేపథ్యంలోని సినిమాలలో ఆయన ఎక్కువగా కనిపిస్తున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘గేదెల రాజు’ - కాకినాడ తాలూకా అనేది ట్యాగ్. ఏప్రిల్ 24వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 17వ తేదీ నుంచి ‘ఆహా’లో స్ట్రీమింగ్ అవుతోంది. క్రైమ్ డ్రామా జోనర్లో తెరకెక్కిన ఈ సినిమా ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం. ‘కాకినాడ’ పరిసర ప్రాంతాలలో ‘భగవాన్ రాజు’ అలియాస్ ‘గేదెల రాజు’ (రఘు కుంచె) తెలియని వారంటూ ఉండరు. ఊళ్లో పనీపాటా లేని కుర్రాళ్లంతా అతని అనుచరులే. డబ్బు .. అమ్మాయిలపై అతనికి వ్యామోహం ఎక్కువ. అందువలన ఆడపిల్లల తల్లిదండ్రులు భయంతో బ్రతుకుతుంటారు. తన రౌడీయిజానికి రాజకీయం కూడా తోడైతే బాగుంటుందని భావించిన గేదెలరాజు’, ముందుగా కార్పొరేటర్ కావాలని కంకణం కట్టుకుంటాడు. ఈ విషయంలో అతనికి ‘దుర్గ’(శ్రీకాంత్ అయ్యంగార్) అడ్డుపడుతుంటాడు. గేదెల రాజు - దుర్గ ఇద్దరూ ఒకప్పుడు మంచి స్నేహితులు. కొన్ని కారణాలు వాళ్లను శత్రువులుగా మారుస్తాయి. ‘దుర్గ’ సంపాదన అంతా కిరాయికి తిరుగుతున్న అతని బోట్లపైనే ఆధారపడి ఉంటుంది. తన వ్యాపారానికి ఎదురులేకుండా ఉండటం కోసం అతను అధికారం కోసం పాకులాడుతుంటాడు. గేదెల రాజుకి వ్యతిరేకంగా తన అనుచరుల సంఖ్యను పెంచుతూ ఉంటాడు. తానే కార్పొరేటర్ కావాలనే పట్టుదలతో ఉంటాడు. అందుకు సంబంధించిన ప్రయత్నాలు గట్టిగానే చేస్తుంటాడు. ఇక ఆ ఊళ్లో ఎక్కువగా వినిపించే పేరు ‘రిచ్’. చెల్లెలు ‘దివ్య’ అంటే అతనికి చాలా ఇష్టం. దివ్య స్నేహితురాలైన ‘మీరా’ (మౌనిక)ను అతను ప్రేమిస్తూ ఉంటాడు. అలాగే ‘మల్లవరం’ గ్రామానికి చెందిన మరో ప్రేమజంటగా విజయ్ - సత్య (టీనా శ్రావ్య) కనిపిస్తారు. ఈ ఇద్దరూ ఒక హాస్పిటల్లో పనిచేస్తుంటారు. భర్తను కోల్పోయిన మీరా తల్లి, గేదెలరాజుతో అక్రమ సంబంధం కొనసాగిస్తూ ఉంటుంది. మరో వైపున సత్యతో పాటు ఆమె ఆస్తిపై కూడా గేదెల రాజు కన్నేస్తాడు. గేదెలరాజు తమ్ముడు ‘శ్యాంబాబు’ అన్నచేసే అరాచకాలకు నాయకత్వం వహిస్తుంటాడు. అయితే అన్నయ్య చేస్తున్న పెత్తనానికి తాను వారసుడిని కావాలనే ఒక బలమైన కోరిక అతనిలో ఉంటుంది. ఇక గతంలో గేదెలరాజుతో కలిసి పనిచేసిన శివయ్య, అతని కారణంగా జైలు జీవితం గడిపొస్తాడు. అప్పటి నుంచి గేదెలరాజుపై ప్రతీకారం తీర్చుకునే సమయం కోసం వెయిట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యలోనే గేదెలరాజు హత్య జరుగుతుంది. అతణ్ణి చంపింది ఎవరు? ఈ కేసు ఇన్వెస్టిగేషన్ లో తేలే నిజాలేమిటి? అనేది కథ. కాకినాడ పరిసర గ్రామాలు .. అక్కడి రాజకీయాలు .. పదవుల కోసం పడే పోటీలు .. అక్రమ వ్యాపారాలు .. ముఠాకక్షలు .. సాధారణ ప్రజలతో పాటు, వాటి బారినపడే ప్రేమికుల చుట్టూ తిరిగే కథ ఇది. మొదటి నుంచి చివరి వరకూ గ్రామాలు .. అక్కడి పరిస్థితులను కలుపుకుంటూ ముందుకు సాగుతుంది. ఒక వైపున గేదెల రాజు హవా కొనసాగడాన్ని చూపిస్తూ, రెండు జంటలకు సంబంధించిన ప్రేమకథలలో కదలిక తీసుకొచ్చారు. సాధారణంగా ఏ కథలోనైనా హీరో - విలన్ ఇద్దరూ ఉంటారు. కానీ ఈ కథలో హీరో - విలన్ ఇద్దరూ ఒక్కరే .. అతనే గేదెలరాజు. కథలో పవర్ఫుల్ గా కనిపించే పాత్ర .. ప్రధానమైన పాత్ర ఏదైతే ఉంటుందో, ఆ పాత్రకి చివరి వరకూ ఏమీ కాదు. ఒకవేళ ఏదైనా జరిగితే అక్కడి నుంచి ఆ కథను ముందుకు నడిపించడం చాలా కష్టమైన విషయం. కానీ ఈ కథలో అందుకు భిన్నంగా జరుగుతుంది. ప్రధానమైన పాత్రగా కనిపించే ‘గేదెలరాజు’ హత్యతోనే ఈ కథ మొదలవుతుంది. గేదెలరాజు చాలా బలవంతుడు, డబ్బు - పలుకుబడి - మందీ మార్బలం ఉన్నవాడు. అలాంటి అతణ్ణి ఎవరు చంపేసి ఉంటారు? అనే దిశగానే ఈ కథ తన ప్రయాణాన్ని మొదలుపెడుతుంది. ఓ ఇరవైఏళ్ల వెనక్కి తీసుకుని వెళ్లి, అక్కడి నుంచి గేదెలరాజు లీలా విశేషాలను మనకి చూపిస్తూ రావడం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే అతని శత్రువులు .. అతనితో ముడిపడిన ప్రేమకథలు తెరపైకి వస్తాయి. గేదెలరాజును ఎవరు చంపేసి ఉంటారు? అనే అంశమే ఆడియన్స్ లో ఉత్కంఠను రేపుతుందని దర్శకుడు భావించి ఉండొచ్చు. అయితే అసలైన గేదెలరాజే చనిపోయిన తరువాత మిగతా కథను తెలుసుకోవడానికి ప్రేక్షకులలో ఎక్కువమంది అంత సిద్ధంగా ఉండకపోవచ్చు. సినిమాల వరకూ చూసుకుంటే, చనిపోయిన ఒక వ్యక్తి తాలూకు హీరోయిజాన్ని .. విలనిజాన్ని ఎంత గొప్పగా చూపించినా ఆశించినస్థాయి ప్రయోజనం ఉండకపోవచ్చునేమో. విలేజ్ నేపథ్యంలో ‘గేదెల రాజు’ పాత్రను డిజైన్ చేసుకున్న తీరు చాలా బాగుంది. అయితే ఆయన ప్రధాన శత్రువులైన దుర్గ .. శివయ్య పాత్రలను అంత సమర్ధవంతంగా మలచలేకపోయారు. ఇక రెండు ప్రేమ జంటలకు సంబంధించిన ట్రాక్ కూడా అంత బలంగా అనిపించదు. ఇందుకు సంబంధించిన సన్నివేశాల ఆవిష్కరణపై ఇంకాస్త కసరత్తు చేయవలసిందేమో అనిపిస్తుంది. నేరం ఎవరు చేశారు? అనే కోణంపై ఆడియన్స్ లో ఆసక్తి పెరగాలంటే, ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు ఒక రేంజ్ లో ఉండాలి. కానీ ఈ ట్రాక్ కూడా బలహీనంగానే కనిపిస్తుంది. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ పాత్ర చాలా వీక్ గా అనిపిస్తుంది. చాలా ముఖ్యమైన ఈ పాత్ర విషయంలో కేర్ తీసుకోవాల్సింది. కొన్ని పాత్రలకి జరిగిన ఆర్టిస్టుల ఎంపిక చూస్తే రాంగ్ ఛాయిస్ అని కూడా అనిపిస్తుంది. ‘రిచ్’ వంటి పేర్లు పిలవడం .. పలకడం కూడా కష్టమేనని గ్రహించాలి. కుంచె రఘు యాక్టింగ్ బాగుంది. ‘గేదెలరాజు’ పాత్రలో ఆయన మెప్పించాడు. ఆయన స్వరపరిచిన ఒక మెలోడీ బాగుంది. నేపథ్య సంగీతం అక్కడక్కడా కాస్త ఇబ్బంది పెడుతుంది. ఇక మిగతా పాత్రలేవీ అంతగా ప్రభావితం చేయలేదు. ఆ స్థాయిలో డిజైన్ చేసే ప్రయత్నాలు జరగలేదు. ఫొటోగ్రఫీ .. ఎడిటింగ్ ఫరవాలేదు. కథలో అనవసరమైన సన్నివేశాలు అవసరానికిమించిన పాత్రలు కూడా కనిపిస్తాయి

# బిగ్‌బాస్ అభిమానులకు శుభవార్త..
## సెప్టెంబరులో కొత్త సీజన్

బిగ్‌బాస్ అభిమానులకు జియోస్టార్ శుభవార్త చెప్పింది. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో బిగ్‌బాస్ కొత్త సీజన్లు సెప్టెంబరులో ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని జియోస్టార్ అధికారికంగా ప్రకటించింది. హిందీ బిగ్‌బాస్‌కు సల్మాన్ ఖాన్, తెలుగులో నాగార్జున, తమిళంలో విజయ్ సేతుపతి, కన్నడలో కిచ్చా సుదీప్, మలయాళంలో మోహన్‌లాల్, బెంగాలీకి సౌరవ్ గంగూలీ వ్యాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా బిగ్‌బాస్ ప్రయాణం, ప్రేక్షకాదరణ, సాంస్కృతిక ప్రభావం, బ్రాండ్‌లకు ఈ షో అందించిన అవకాశాలపై ‘ఇండియాస్ బిగ్ రియాలిటీ’ పేరుతో జియోస్టార్ ప్రత్యేక కాఫీ టేబుల్ బుక్‌ను కూడా విడుదల చేసింది. గత రెండు దశాబ్దాలుగా బిగ్‌బాస్ ప్రతి సీజన్‌తో మరింత ప్రజాదరణ పొందుతోందని జియోస్టార్ ప్రతినిధులు తెలిపారు. ఈసారి ఒకేసారి ఆరు భాషల్లో కొత్త సీజన్లు ప్రారంభం కావడం షో చరిత్రలోనే అతిపెద్ద వేడుకగా నిలవనుందని పేర్కొన్నారు.





# ‘రామాయణ’
## ఓ మహా ప్రయాణానికి శ్రీకారం



‘ఇది కేవలం సినిమా మాత్రమే కాదు. మనదేశం కల. ఆ కలను నిజం చేసేందుకు మేమంతా చేసిన ప్రయత్నమే ‘రామాయణ’ ’ అన్నారు నటుడు, నిర్మాత యశ్. ఆయన రావణుడిగా నటిస్తూ నమిత్ మల్హోత్రాతో కలిసి స్వయంగా నిర్మించిన పానిండియా పౌరాణిక దృశ్యకావ్యం ‘రామాయణ’. రణబీర్‌కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుండగా, ‘రామాయణ : పార్ట్ 1’ దీపావళి కానుకగా నవంబర్‌లో విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ నెల 24న ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా దేశ రాజధాని దిల్లీలో ప్రథమ్ సంకల్ప్ పేరిట ఏర్పాటు చేసిన వేడుకలో నటుడు, నిర్మాత యశ్ మాట్లాడారు. ‘మన సీతారాముల కథను ప్రపంచ వేదికపై నిలబెట్టాలనే సంకల్పంతో చేసిన ప్రయత్నమిది. దేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఓ మహా ప్రయాణానికి శ్రీకారం ఈ ‘రామాయణ” అని దర్శకుడు నితేశ్ తివారి పేర్కొన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి, రకుల్‌ప్రీత్‌సింగ్, వివేక్ ఒబెరాయ్, సన్నీ దేఒల్, శోభన, అరుణ్‌గోవిల్ సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24న విడుదల కానున్న ట్రైలర్‌ని ఎంపిక చేసిన అతిథులకు ప్రత్యేకంగా ప్రదర్శించారు.

## మీ సినిమాలో నటించడానికి నేను రెడీ..
### రాజమౌళికి పీవీ సింధు ఫన్నీ రిక్వెస్ట్





భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు మరోసారి అంతర్జాతీయ వేదికపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడం తెలిసిందే. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి చారిత్రక ఘనతను అందుకుంది. నిన్న జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో ఆమె జపాన్‌కు చెందిన అగ్రశ్రేణి క్రీడాకారిణి అకనే యమగూచిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో సింధు 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో జపాన్ ఓపెన్ గెలిచిన మొట్టమొదటి భారతీయ షట్లర్‌గా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించింది. అయితే, ఈ చారిత్రక విజయం తర్వాత ఆమె సోషల్ మీడియాలో చేసిన ఒక వ్యాఖ్య క్రీడా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.సింధు అద్భుత విజయంపై స్పందించిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. “ఇది నిజమైన ఛాంపియన్ కంబ్యాక్. నీ అద్భుత విజయానికి శుభాకాంక్షలు సింధు. దేశం మొత్తం నిన్ను చూసి గర్విస్తోంది” అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాజమౌళి ప్రశంసలకు సింధు అంతే ఆసక్తికరంగా, చమత్కారంగా స్పందించింది.రాజమౌళికి ధన్యవాదాలు తెలిపిన సింధు, ఆయన దర్శకత్వంలో రాబోతున్న ‘వారణాసి’ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఆమె రాజమౌళికి ఒక సరదా ఆఫర్ ఇచ్చింది. “భవిష్యత్తులో మీ కథల్లో ఎప్పుడైనా ఒక బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పాత్ర అవసరమైతే, ఓ ‘కొత్త నటి’గా మారడానికి నేను సంతోషంగా సిద్ధంగా ఉన్నాను” అంటూ ట్వీట్ చేసింది. ఈ ఊహించని ఆఫర్‌తో సింధు అందరి దృష్టిని ఆకర్షించింది.ప్రస్తుతం రాజమౌళి, సింధు మధ్య జరిగిన ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తే బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు ఖాయమని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. క్రీడా మైదానంలో ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా తన చమత్కారంతో అందరినీ ఆకట్టుకుంటున్న సింధుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# నాకు ఎవరి అనుమతి అక్కర్లేదు

### - ఇక నా జీవితం నాదే: అనుపమ పరమేశ్వరన్



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన, భావోద్వేగ పోస్ట్ చేశారు. తనకు శాంతి దొరికిందని, ఇకపై ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని, భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. “నా గొంతుకను నేనే ఎంచుకుంటా” అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె రాస్తూ, “కొన్నిసార్లు శాంతిని కనుగొనడానికి కొన్నింటిని వదిలేయాల్సి ఉంటుంది. ఈ రోజు నాకు ఆ శాంతి దొరికింది. ఈ రోజు నుంచి నా గొంతుకను, నా జీవితాన్ని నేనే ఎంచుకుంటాను. ఇకపై అనుమతులు లేవు, భయాలు లేవు. నన్ను నేను వెతుక్కుంటూ నా జీవితాన్ని ప్రేమిస్తున్నాను” అని పేర్కొన్నారు.

చాలా కాలంగా చెప్పాలనుకున్న విషయాన్ని ఇప్పుడు చెబుతున్నానని, ఇంతకాలం దాన్ని చెప్పేందుకు తనను అనుమతించలేదని ఆమె అన్నారు. అభిమానులందరికీ “ఐ లవ్యూ” చెప్పారు.తనపై నమ్మకం ఉంచి, అండగా నిలిచిన అభిమానులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సందేశం, ప్రతి ప్రార్థన తనకు అవసరమైన సమయంలో చేరాయని పేర్కొన్నారు. తనను తిరిగి తన దగ్గరకు చేర్చినందుకు యూనివర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వేచ్ఛను, తనను తాను ఎంచుకోవడాన్ని సంపూర్ణంగా స్వీకరిస్తున్నట్లు అనుపమ తన పోస్ట్‌ను ముగించారు.

ఇక అనుపమ కెరీర్ విషయానికొస్తే, ప్రస్తుతం ఆమె శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ డ్రామా ‘భోగి’లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె కందుల సులోచన రాణి అనే పాత్రలో కనిపించనున్నారు. సులోచన పల్లెటూరి యువతిగా, ప్రకృతితో మమేకమయ్యే బలమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. ఈ సినిమాలో శర్వానంద్ ‘గంగ’ అనే పాత్రలో నటిస్తున్నట్లు గతంలోనే మేకర్స్ ప్రకటించారు.

# నన్నంతా ఫ్యామిలీ హీరో అంటున్నారు



‘సినిమాకు అద్భుతమైన స్పందన వచ్చింది. థియేటర్లలో ప్రేక్షకులు ఓ రేంజ్‌లో సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. అమెరికా నుంచి కూడా అభినందనలు వస్తున్నాయి. ప్రతిచోటా షోలు పెరుగుతున్నాయి. మౌత్ టాక్ స్ప్రెడ్ అయి, విజయం వైపు సినిమా దూసుకుపోతున్నది. నన్నంతా ఫ్యామిలీ హీరో అంటున్నారు. ఇంతటి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు’ అని హీరో తిరువీర్ అన్నారు. ఆయన, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటించిన రూరల్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘ఓ..!సుకుమారి’. భరత్‌దర్శన్ దర్శకత్వంలో మహేశ్వరరెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో హీరో తిరువీర్ మాట్లాడారు. మౌత్ టాక్ బావుందని, కొంత సమయం ఇస్తే ఈ సినిమా ఇంకా పుంజుకుంటుందని, రెండున్నర గంటల పాటు హాయిగా నవ్వుకునేలా సినిమా ఉందని అంతా ప్రశంసిస్తున్నారని దర్శకుడు భరత్ దర్శన్ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత మహేశ్వర్‌రెడ్డి, క్రాంతి, డీవోపీ కుషేందర్, నటుడు అంజిమామ కూడా మాట్లాడారు.

# గిన్నిస్ విజేతలను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- గిన్నిస్ వరల్డ్ రికార్డ్ విజేతలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సన్మానం
- నాచారం టీంమాస్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులు
- బి. మోహన్ కుమారుడు బి. రాము సహా పలువురికి సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం
- ప్రపంచ స్థాయిలో రాణిస్తున్న యువతను ప్రభుత్వం ప్రోత్సహించాలంటూ ఎమ్మెల్యే డిమాండ్



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ప్రపంచ స్థాయిలో తెలంగాణ ప్రతిష్ఠను చాటిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ విజేతలను ప్రభుత్వం గుర్తించి తగిన ప్రోత్సాహకాలు అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమంలో నాచారం టీం మాస్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బి.మోహన్ కుమారుడు బి.రాము బి.గట్టు, బి.భరత్, బి.చెన్నమ్మ, జే.కృత్విక్, బి.యక్షిత్ వర్ధన్, శివచరణ్, శివకుమార్, మాణితేజ ఈ పోటిల్లో పాల్గొని విజయాన్ని నమోదు చేశారు. కార్యక్రమం అనంతరం 45 రోజుల తర్వాత వారికి గిన్నిస్ రికార్డ్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందాయి. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొస్తున్న యువతను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి నగదు ప్రోత్సాహకాలు, అవార్డులు, శిక్షణ అవకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువతలో స్ఫూర్తి నింపవచ్చని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## నూతనంగా నిర్మించిన రోడ్డు నాణ్యతను పరిశీలించాలి : ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్--మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్ ఇందిరానగర్‌లో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలించి, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ఒంపు లక్ష్మయ్య ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ నుంచి పాపయ్య మిర్చి బండి వరకు నిర్మించిన నూతన రోడ్డుకు వారం రోజులు గడిచినా, నిబంధనల ప్రకారం మట్టితో కట్టలు ఏర్పాటు చేసి నిరంతర వాటర్ క్యూరింగ్ చేయడం లేదని ఆరోపించారు. ట్యాంకర్ ద్వారా కొద్దిసేపు మాత్రమే నీరు పోసి వెళ్లిపోతుండటంతో నీరు వెంటనే ఎండిపోతోందని, దీంతో రోడ్డు మన్నిక తగ్గి త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులు సూచించినప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, నాణ్యతపై ప్రశ్నించిన ప్రజావాణి ప్రతినిధులను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పినా, ఎవరికైనా చెప్పుకోండి, ఏమైనా చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా స్పందించాడని తెలిపారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై సాంకేతిక విచారణ నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ విజ్ఞప్తి చేసింది.

## స్వర్గీయ కాకా వెంకటస్వామి విగ్రహాన్ని శుభ్రపరిచి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాలమహానాడు నాయకులు.



**మంథని ( ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లా మంథని పాత పెట్రోల్ బంక్ వద్ద ఉన్న స్వర్గీయ కాకా వెంకటస్వామి విగ్రహాన్ని ప్రతి నెల 20వ తేదిన మాలమహానాడు నాయకులు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాల పోచమల్లు, మంథని డివిజన్ ప్రెసిడెంట్ ఎడ్ల కిష్టయ్య, మాలమహానాడు నాయకులు జంజర్ల రమేష్ తదితరులు కాకా వెంకటస్వామి విగ్రహాన్ని, శుభ్ర పరిచి నీటితో శుభ్రంగా కడిగి పాలతోని అభిషేకం చేసి కాకా విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల దయనీయ స్థితి

- సొంత ఖర్చుతో ఫ్యాన్లు ఇచ్చిన పేరెంట్స్ కమిటీ
- అడవిలో గురుకులం సర్పాల భయం, కరెంట్ షాక్ ముప్పు: తక్షణ చర్యలు కోరిన తల్లిదండ్రులు
- గురుకులంలో కనీస సౌకర్యాలు లేవు.
- అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం.




**ములుగు( ప్రశ్న న్యూస్)**బిములుగు జిల్లా మల్లంపల్లి వద్ద తాత్కాలిక భవనంలో నడుస్తున్న టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్. ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల.కళాశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని పేరెంట్స్ కమిటీ ఆరోపించింది. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని కమిటీ మండిపడింది. తరగతి గదులు, హాస్టల్ రూముల్లో సీలింగ్ ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఉక్కపోత, దోమల బెడదతో రాత్రుళ్లు నిద్రపోలేకపోతున్నారని తెలిపింది. ఈ దుస్థితిని చూసి చలించిన పేరెంట్స్ కమిటీ సభ్యులు తమ స్వంత ఖర్చులతో సీలింగ్ ఫ్యాన్లు కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. కమిటీ అధ్యక్షులు అర్షం రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు జాడి ఈశ్వర్ నేతకాని, సభ్యులు రాజేందర్, దుర్గం సమ్మయ్య, ప్రముఖులు కోడెపాక రాజు, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫ్యాన్లను ప్రిన్సిపాల్‌కు అప్పగించారు.

### భద్రతకు ముప్పు.

గురుకులంలో అనేక సమస్యలు ఉన్నాయని కమిటీ వెల్లడించింది. హాస్టల్‌లో స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవు. అత్యవసర సమయాల్లో విద్యార్థులు బకెట్లు పట్టుకుని పక్కనే ఉన్న అడవిలోకి వెళ్లాల్సి వస్తుంది. గదులకు సరైన తలుపులు, కిటికీలు లేకపోవడంతో అడవి నుంచి విషసర్పాలు, కీటకాలు లోపలికి వచ్చే ప్రమాదం ఉంది. ప్రతి గదిలో స్విచ్ బోర్డులు బయటకు వేలాడుతున్నాయి. పిల్లలు తాకితే కరెంట్ షాక్ తగిలే ప్రమాదం ఉంది.

### మంత్రి, కలెక్టర్ స్పందించాలి: కమిటీ డిమాండ్.

పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లా మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ ఈ సమస్యలపై ఇప్పటివరకు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత భవనం, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోని సమయంలో విద్యార్థుల కోసం ఫ్యాన్లు అందించిన పేరెంట్స్ కమిటీకి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశం



**ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)** ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో ఈరోజు సమావేశ మందిరంలో గిరిజన దర్బార్‌ను నిర్వహించారు. గిరిజనుల నుండి స్వయంగా వినతులు స్వీకరించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ములుగు, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు మొత్తం 19 దరఖాస్తులను అందజేశారు. గృహాలు, ఉద్యోగాలు, విద్య, తాగునీరు, రోడ్డు సౌకర్యాలకు సంబంధించిన వినతులు అధికంగా ఉన్నాయి.

### ప్రజా దర్బార్‌లో ముఖ్యమైన వినతులు..

బుటారం, కొంగాల, బుర్గుపేట, బుటారం, పుసురు గ్రామాల నుండి గృహ మంజూరు కోరుతూ దరఖాస్తులు. మాదవరపల్లికి చెందిన భూక్య ప్రతాప్ సింగ్ మరణంతో కారుణ్య నియామకం, మల్రిమెట్ల పాఠశాలలో స్వీపర్/అటెండర్ పోస్టు, ఆకులవారి ఘనపురం ఆర్ఐటిఐ లో అటెండర్, స్వీపర్ పోస్టుల కోసం వినతులు. దుబ్బతండ గ్రామం నుండి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 8వ తరగతి సీటు కోసం దరఖాస్తు. మంగలవారి పేట నుండి డిఎస్సి 2008 రికార్డుల కోసం. పర్షా తండ నుండి ఇందిర సౌర గిరిజల వికాసం కింద బోరు మంజూరు, చాల్వాయి గ్రామానికి పొలాలకు దారి ఏర్పాటు, గూడూరు నుండి ఆర్ఐటిఐ సమాచారం కోసం దరఖాస్తులు. దరఖాస్తులను పరిశీలించిన పీవో, ప్రతి సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ స్పెషల్ డిప్యూటి కలెక్టర్. ఇంచార్జ్ ఏపీవో జనార్దన్. డిప్యూటి డైరెక్టర్, సురేష్ ఈ ఈ క్రాంతి కుమార్. డిప్యూటి వాణి డియం జిసిసి. కొమురం ప్రభాకర్ పేసా కో-ఆర్డినేటర్. కిషోర్ జియాలజిస్ట్, జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ. టిస్ఆర్ టిసి ఎల్.శంకర్ మేనేజర్ తో పాటు గ్రీవెన్స్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

## విద్య దేశాభివృద్ధికి బలమైన పునాది:గవర్నర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ,జాతీయ భావన కూడా అవసరమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. విద్య అంటే కేవలం జ్ఞానాన్ని అందించడం మాత్రమే కాదని,మంచి వ్యక్తిత్వం, కరుణ,క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడం కూడా విద్య యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కాలేజీలో నిర్వహించిన కాలేజీ 86వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్),ఎన్‌సీసీ, సాంస్కృతిక కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు వారి జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తాయని గవర్నర్ అన్నారు. దేశం ప్రస్తుతం నవీన ఆవిష్కరణలు, పరిశోధన,సాంకేతికత, ఆత్మనిర్భరత దిశగా వేగంగా ముందుకు సాగుతోందని,ఈ మార్పుకు యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులు నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు విద్యకు దూరం కాకుండా సంస్థ తీసుకున్న చర్యలను గవర్నర్ ప్రశంసించారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు అండగా నిలిచి,డిజిటల్ విద్యను అందించడం ద్వారా విద్యా సేవలను కొనసాగించడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులకు అవకాశాలు కల్పించడం విద్యాసంస్థల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. కేశవ్ మెమోరియల్ సంస్థ స్థాపకులు పండిట్ వినాయక్ రావు విద్యాలంకార్‌కు గవర్నర్ ఘన నివాళులు అర్పించారు. విద్యనే స్వాతంత్ర్యానికి, సమాజాభివృద్ధికి బలమైన పునాదిగా ఆయన భావించారని గుర్తుచేశారు. ఉన్నత విద్యలో ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందని, పాఠ్యాంశాల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు ప్రోత్సాహం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రెండు, మూడు దశాబ్దాలు దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైనవని,అందరూ సమష్టిగా కృషి చేస్తే ప్రపంచ స్థాయిలో పోటీ పడగల సమర్థవంతమైన యువతను తీర్చిదిద్దవచ్చని బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు.ం

## ఆర్టీసీ పేదల జీవనాడి,సులభం,సురక్షితం:పోన్నం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)ని ప్రభుత్వంలో విలీనం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా చేస్తుందని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముందుగా ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు నిర్వహించి, అనంతరం విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకాడదని పోన్నం పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో టీజీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆర్టీసీ ఉద్యోగుల చేయూత' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ వైస్ చైర్మన్,ఎండీ వై. నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట డిపో డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు సమకూర్చిన రూ.90.85 లక్షల చెక్కును మంత్రి,ఎండీ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు అండగా నిలవడం అభినందనీయమన్నారు. శంకర్‌గౌడ్ కుమారుడు హేమంత్‌కు ఉద్యోగం కల్పిస్తామని,కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని తెలిపారు. రూ.6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి నెల రెండో మంగళవారం కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని చెప్పారు. శంకర్‌గౌడ్ సతీమణి హేమలత మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని నిలబెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న తన భర్త శంకర్‌గౌడ్ కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె కోరారు.

## "30"లతో పాఠశాల అభివృద్ధి: ఎమ్మెల్యే శ్రీ గణేష్.



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్య సంస్థలకు దీటుగా ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి విద్య శాఖకు సూచించారు. విద్య, విధానంలో ఎటువంటి మార్పులతో పాటు మౌళిక సదుపాయాల కల్పనలో నెంబర్ వన్ గా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న కార్ఖానా ప్రభుత్వ బాలికల పాఠశాలలో రూ.30 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ శంకుస్థాపన చేశారు. కార్ఖానాలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కీలక అడుగు పడింది. పాఠశాల అభివృద్ధికి మంజూరైన రూ. 30 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థినులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా ఈ ప్రత్యేక నిధులతో పాఠశాలలో అవసరమైన ఆధునికీకరణ పనులు,ఇతర మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. బాలికల విద్యకు, వారి భవిష్యత్తుకు పెద్దపీట వేస్తూ ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు, మాజీ టి పిసిసి సెక్రటరీ రాజేష్ యాదవ్,మహేష్ యాదవ్, మహ్మద్ జమీల్,షణ్ముఖం, మురళీ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, శివరాత్రి వినోద్,స్వర్ణ,ఆదిత్య యాదవ్,ఎన్ఎస్ యుఐ నాయకులు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రైతుల కప్పతల్లి ఆట

- వానలు కురవాలి పంటలు పండాలి



**ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్)** వర్షాలు కురవడం లేదు. వర్షాల కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. తొలకరి పలకరించినా తరువాత వర్షాలు ముఖం చాటేశాయి. దుక్కులు దున్నీ సిద్ధంగా ఉన్నారు రైతులు. కానీ, వర్షం చుక్క లేదు. దీంతో గ్రామాల్లోని రైతులు వాన దేవుడికి జలభి షేకం చేస్తున్నారు. పిల్లలు, పెద్దలు కలిసి గ్రామాల్లో కప్ప తల్లి ఆటలు ఆడుతున్నారు. వెంకటాపూర్ మహిళా రైతులు పోచమ్మ తల్లికి జలభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేసి, రోకలికి గుడ్డలో కప్పని కట్టి, కప్పతల్లి ఆటను ప్రారంభించి, ఇంటింటికి వెళ్లి కప్ప పైన బిందెలతో నీళ్ళు పోసి వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు పడకపోతే. పంటలు ముందుకు సాగవని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని మహిళా రైతులు వర్షాలు రావాలన్న ఆశతో కప్పతల్లి ఆడి, సాంప్రదాయిక నృత్యం చేశారు. పూజతో పాటు..కప్పలతో ఊరేగించారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి కప్పతల్లి ఆట ఆడారు. పసుపు బట్టలో కప్పలను కట్టి ఆ పసుపు బట్టను రోకలికి కట్టి డప్పుచప్పుల్లతో గ్రామంలో ఇంటింటికి తిరిగారు. ఇండ్ల వద్దకు వచ్చిన వారికి ప్రతీ ఒక్కరూ బిందెలతో నీళ్లు పోస్తూ వానదేవుడు కరుణించాలని వేడుకున్నారు. ఇప్పటికే. పలు చోట్ల ఆరు తడి పంటలు సాగు చేశారు. అయితే..సరిగా వర్షాలు లేకపోవడం తో..పంటలు ఎండిపోతున్నాయి అంతే కాకుండా. నార్లు పోయాలంటే. రైతులు ఆలోచిస్తున్నారు. వానదేవుడు కరుణించి. వర్షాలు కురియాలని రైతు లు కోరుతున్నారు.

# పార్టీ కండువా.. మారనుందా.?

- మల్లారెడ్డి మౌనం వెనుక మర్మమేంటి.?
- బీఆర్ఎస్‌లో కొత్త చర్చకు తెర
- సీఎం వ్యాఖ్యలపై మల్లారెడ్డి ఎందుకు స్పందించలేదు.?
- కే టి ఆర్ సమావేశానికి ఎందుకు హాజరు కాలేదు.?
- బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని అంతర్గత నిర్ణయమా.?
- వ్యక్తిగత కారణాలవాల్లే ఈ దూరమా.?



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాజకీయాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వైఖరి మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేసినప్పటికీ, అదే వేదికపై ఉన్న మల్లారెడ్డి ఆ వ్యాఖ్యలపై ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అంతేకాక జూలై 18న కేటీఆర్ నిర్వహించిన కీలక పార్టీ సమావేశానికి కూడా మల్లారెడ్డి హాజరు కాకపోవడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలతో మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీ దూరమవుతున్నారా.? లేక రాజకీయంగా కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ మల్లారెడ్డి వ్యవహారశైలిపై చర్చ కొనసాగుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కెసిఆర్ నా దేవుడు అని చెప్పుకొనే మల్లారెడ్డి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించకపోవడం, మరోవైపు పార్టీ కీలక సమావేశానికి దూరంగా ఉండడం వెనుక ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా చర్చ సాగుతోంది. అయితే ఇప్పటివరకు మల్లారెడ్డి స్వయంగా ఈ అంశాలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఆయన వైఖరిపై వస్తున్న ఊహాగానాలకు మరింత బలం చేకూరుతోంది. ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న ప్రధానంగా ఈ మౌనానికి సమాధానం మల్లారెడ్డి నుంచే రావాల్సి ఉంది. అప్పటి వరకు ఆయన మౌనం రాజకీయ చర్చలకు కారణమవుతూనే ఉండే అవకాశం ఉంది.

### మేడ్చల్ కు నాయకత్వం వహించేది ఎవరు

ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకవేళ పార్టీ మారితే మేడ్చల్ నియోజకవర్గానికి నాయకత్వం వహించేది ఎవరు అంటూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ మారినా తాము మాత్రంబి ఆర్ఎస్ పార్టీలోనే ఉంటాము అంటూ ఆ పార్టీ ప్రముఖ శ్రేణులు పేర్కొనడం ఆసక్తిని నింపుతుంది. ఒకవేళ ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ మారితే మేడ్చల్ నియోజకవర్గం ఒక పెద్ద దిక్కును కోల్పోయే ఏర్పడుతుందా.? లేక బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం కలుగుతుందా.? ఎంపీగా ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి ఒకవేళ పార్టీ మారితే నియోజకవర్గానికి నాయకత్వం వహించేది ఎవరు అంటూ ఓ కొత్త ప్రశ్నలు తెరమీదకి వస్తున్నాయి. ఇప్పటివరకు మేడ్చల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి పెద్దదిక్కుగా ఉన్నారు. అన్ని తానై వ్యవహరించారు. ఆర్థికంగా బలంగా ఉండడంతో ఖర్చులకు సైతం వెనకాడ లేదు. అలాంటి బలమైన నేత బిఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉండడం అవకాశ రాజకీయమా అంటూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ మారుతాడని బలమైన సంకేతాలు కనిపిస్తుండడంతో జిహెచ్ఎంసి ఎన్నికల ముందు ఆ పార్టీకి పెద్ద దెబ్బేనని తెలుస్తుంది. జిహెచ్ఎంసి ఎన్నికలు సమీపిస్తుండడం వల్ల ఈ విషయం త్వరలోనే తేల్చుకోవాలని పార్టీ శ్రేణులు భావిస్తున్నట్లు సమాచారం.

## విపక్షాల నిరసనలతో
# హోరెత్తిన పార్లమెంటు

- ఉభయసభలు నేటికి వాయిదా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం వాడివేడిగా ప్రారంభమయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో, తొలిరోజే ఉభయ సభలు రోజంతటికీ వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు జరగనుండగా, మొత్తం 19 పనిదినాలు ఉన్నాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా దివంగత సభ్యులకు నివాళులర్పించి, సభ గౌరవాన్ని కాపాడాలని సభ్యులను కోరారు. కానీ, ప్రతిపక్ష సభ్యులు నీట్ వివాదం, విద్యార్థుల ఆత్మహత్యలపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో నేటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యాలు కనిపించాయి. సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడుతూ.. స్కైరూట్ రాకెట్ ప్రయోగం, హైడ్రోజన్ రైలు వంటి విజయాలను ప్రస్తావిస్తూ దేశ యువతను ప్రశంసించారు. అయితే, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ వివాదంపై ఆయన ఏమీ మాట్లాడలేదు. మరోవైపు, నీట్ లీక్‌లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ (కాక్‌రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ చేపట్టారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు, ఆర్‌ఏఎఫ్ బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు విధించారు. ఈ సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్

- కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

# డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్

- 'క్యూడెంగా'కు ఆమోదం!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వర్షాకాలం మొదలైతే డెంగీ భయం వెంటాడటం మనకు కొత్త కాదు. ఏటా వేలాది మంది ఆసుపత్రుల పాలవుతుంటారు. అలాంటి డెంగీ నియంత్రణలో భారత్ కీలక ముందడుగు వేసింది. దేశంలో తొలి డెంగీ వ్యాక్సిన్‌గా జపాన్‌కు చెందిన టకెడా కంపెనీ రూపొందించిన 'క్యూడెంగా'కు 'కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఆమోదం తెలిపింది. దీంతో డెంగీ నివారణలో భారత్‌కు మరో కీలక ఆయుధం అందుబాటులోకి రానుంది. భారత్‌లో గత రెండు దశాబ్దాలుగా డెంగీ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు, దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు, జనాభా పెరుగుదల ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డెంగీ కేసుల్లో దాదాపు మూడో వంతు భారత్‌లోనే ఉంటాయని అంచనా. ముఖ్యంగా వర్షాకాలం, ఆ తర్వాతి నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. క్యూడెంగా (టీఏకే-003)ను జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకెడా అభివృద్ధి చేసింది. ఇది లైవ్ అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్. అంటే డెంగీ వైరస్‌లోని నాలుగు రకాలైన డెన్‌వీ-1, డెన్‌వీ-2, డెన్‌వీ-3, డెన్‌వీ-4పై రోగనిరోధక శక్తిని పెంచేలా రూపొందించారు. ఈ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఇస్తారు. చర్మం కింద ఇంజెక్షన్ రూపంలో వేస్తారు. డెంగీ అధికంగా ఉన్న దేశాల్లో సమగ్ర నియంత్రణ వ్యూహంలో భాగంగా దీన్ని వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇప్పటికే సూచించింది. ఈ వ్యాక్సిన్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. గతంలో అందుబాటులో ఉన్న డెంగ్‌వాక్సియా వ్యాక్సిన్ తీసుకునే ముందు వ్యక్తికి ఇప్పటికే డెంగీ సోకిందో లేదో రక్త పరీక్ష చేయాల్సి వచ్చేది. అలాంటి అవసరం క్యూడెంగాకు లేదు. డెంగీ వచ్చినా, రాకపోయినా ఈ వ్యాక్సిన్ ఇవ్వొచ్చు. దీంతో సామూహిక టీకా కార్యక్రమాలను సులభంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్, బ్రిటన్, బ్రెజిల్, ఇండోనేషియా, అర్జెంటీనా సహా 40కిపైగా దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతులు లభించాయి. ఇప్పుడు ఆ జాబితాలో భారత్ కూడా చేరింది. క్యూడెంగా ప్రభావంపై నిర్వహించిన ట్రైడ్స్ ఫేజ్-3 క్లినికల్ అధ్యయనంలో 20 వేల మందికిపైగా పిల్లలు, యువత పాల్గొన్నారు. సుమారు నాలుగున్నరేళ్ల పరిశీలనలో ఆసుపత్రిలో చేరే పరిస్థితిని 84 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు. ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారిత డెంగీ కేసులపై దాదాపు 61 శాతం రక్షణ కల్పించినట్లు వెల్లడైంది. గతంలో సోకిన వారికైనా, సోకని వారికైనా తీవ్రమైన డెంగీ ప్రమాదాన్ని తగ్గించడంలో మంచి ఫలితాలు కనిపించాయి. వైరస్ రకాన్ని బట్టి ప్రభావంలో కొంత తేడా ఉన్నప్పటికీ మొత్తం ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ఈ వ్యాక్సిన్ ధరను ఇంకా ప్రకటించలేదు. అయితే హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ'తో టకెడా ఇప్పటికే ఉత్పత్తి ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి ఐదు కోట్ల డోసులు తయారు చేసే సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయంగా తయారీ ప్రారంభమైతే ధరలు తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. మొదట ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుబాటులోకి వస్తుందా, లేక ప్రభుత్వ టీకా కార్యక్రమంలో చేర్చుతారా అన్న విషయంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# శవయాత్రకు సైతం దుర్భరం

- స్మశాన రోడ్డు ఇంత అద్వాన్నమా
- ఏటూరునాగారం ఒడవాడలో గ్రామస్తుల ఆవేదన
- అభివృద్ధికి నోచుకోక ఎన్నేళ్లు ఈ కష్టం
- గ్రామాల అభివృద్ధి మాట పేరుకేనా.?
- ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకనే ఈ దుస్థితి





**ఏటూరునాగారం (ప్రశ్న న్యూస్)** మనిషి చనిపోయిన తర్వాత కూడా కడసారి గౌరవం దక్కని పరిస్థితి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఓడవాడ గ్రామ శివారులోని స్మశాన వాటికకు వెళ్లే రహదారి అసంపూర్తిగా ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓడవాడ పక్కన రావణాసురవాడ వైపు ఉన్న ఈ స్మశానానికి ఏటూరునాగారం చుట్టుపక్కల 10 కి పైగా గ్రామాల ప్రజలు అంత్యక్రియల కోసం వస్తుంటారు. కానీ ఇక్కడికి వెళ్లే రోడ్డు గత 5 సంవత్సరాలుగా పూర్తిగా ధ్వంసమైంది. వర్షాకాలంలో బురదమయంగా, ఎండాకాలంలో దుమ్ముతో నిండిపోతుంది.

### పనులు ప్రారంభించి మధ్యలో ఆపేశారు.

రోడ్డు దుస్థితిపై గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదులు చేయడంతో కొన్ని నెలల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ముందుగా మట్టితో లెవెల్ చేయించి, 2 నుంచి 3 లారీల కంకర కూడా పోయించారు. అయితే ఆ తర్వాత ఎటువంటి పనులు జరగలేదు. పోసిన కంకర, మట్టి వల్ల ఇప్పుడు వాహనాలు వెళ్లడం మరింత కష్టంగా మారింది.

### అంబులెన్స్ లు కూడా రావడం లేదు.

ఊర్లో ఎవరైనా పెద్దవారు చనిపోతే శవాన్ని తీసుకెళ్లడానికి అంబులెన్స్.వైకుంఠ రథం కారు ఏదీ లోపలికి రావడం బయటికి వెళ్ళడం లేదు. 1 కి.మీ వరకు భుజాలపై మోసుకెళ్లాల్సి వస్తుంది. వర్షం వస్తే పరిస్థితి ఇంకా దారుణం. ఇది చూస్తే మనసు చలించిపోతుంది. అని గ్రామస్తుడు మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో గ్రామస్తుడు మాట్లాడుతూ కాంట్రాక్టర్ పని స్టార్ట్ చేసి డబ్బులు తీసుకుని ఆపేశాడు. సర్పంచ్ దగ్గరికి, ఎంపిడిఓ ఆఫీస్ కి తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అని తెలిపారు.

### వెంటనే పూర్తి చేయాలి.

స్మశాన వాటికకు వెళ్లే రోడ్డు కనీస మౌలిక సదుపాయాల్లో ఒకటి. మానవతా దృక్పథంతో దీన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాలి. కానీ ఏటూరునాగారంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్, సర్పంచ్ వెంటనే స్పందించి మిగిలిపోయిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించి, తారు రోడ్డు వేయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588